

ఎన్‌హెచ్ 216 హెచ్ అభివృద్ధికి..
నిధుల మంజూరుకు పరిశీలిస్తున్నాం..

» ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కు కేంద్ర మంత్రి గడ్కరీ లేఖ

న్యూఢిల్లీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా పరిధిలోని 216 హెచ్ జాతీయ రహదారిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను డీపీఆర్‌లో చేర్చామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వార్షిక ప్రణాళికలోనే నిధుల మంజూరు అంశం తమ పరిశీలనలో ఉందని ఎంపీ పుట్టా మహేశ్‌కు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరి లేఖ ద్వారా తెలిపారు. నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరు వెళ్లే రహదారిలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి తుక్కులూరు నుంచి నూజివీడు మున్సిపల్ ఏరియా ముగింపు వరకు ఆరు కిలోమీటర్ల మేర సర్వీస్ రోడ్డు కనెక్టివిటీ, తుక్కులూరు సమీపంలో ఫ్లయ్‌ఓవర్, కొత్త కల్వర్టు తదితర నిర్మాణాలు చేపట్టాలని ఎంపీ మహేశ్ గతంలో కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎంపీ వినతికి స్పందించిన కేంద్ర మంత్రి ఈ మేరకు ఎంపీకి లేఖ ద్వారా తెలిపారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.


జనసేన నేతపై చింతమనేని అనుచరుల దాడి -7లో

నేడు పెనుగొండకు
సీఎం చంద్రబాబు



సీఎం దిగే హెలీప్యాడ్‌ను తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్


» వాసవీ మాతకు సతీ సమేతంగా పట్టువస్త్రాల సమర్పణ.. అధికారులు ఏర్పాట్లు పూర్తి



పెనుగొండ/ఆచంట, జనవరి 30(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీ సమేతంగా శుక్రవారం పెనుగొండ రానున్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును పురస్కరించుకుని ఇక్కడ ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతోంది. సీఎం పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు రోజులుగా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీమ్ అస్మి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, దేవస్థానం అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో కన్యకా పరమేశ్వరి, వాసవి ధామ్ ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు.

సీఎం టూర్ షెడ్యూల్

- ఉదయం 10.30 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.05 గంటలకు పెనుగొండ ఏఎంసీలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.05 నుంచి 11.10 వరకు హెలీప్యాడ్ వద్ద ప్రజలను కలుసుకుంటారు.
- 11.15 గంటలకు రోడ్డు మార్గంలో కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకుంటారు.
- 11.45 వరకు ఆలయంలో ఉంటారు.
- 11.50 గంటలకు వాసవి ధామ్‌కు చేరుకుంటారు.
- 12.15 ఏఎంసీలోని హెలీప్యాడ్‌కు బయలు దేరతారు.
- 12.20 గంటలకు హెలీకాప్టర్‌లో తిరిగి ఉండవల్లికి పయనమవుతారు.



6

ఆత్మగౌరవ రక్షణకు.. ఆత్మార్పణ

పెనుగొండ నగరేశ్వరస్వామి ఆలయంలో ఆత్మార్పణ చేసుకున్న వాసవాంబ.. వాసవీ కన్యకా పరమేశ్వరిగా అవతరించారు. తనను పెళ్లి చేసుకోవాలనుకున్న రాజు విష్ణువర్ధనుడి నుంచి పెనుగొండను రక్షించేందుకు, తన ఆత్మ గౌరవాన్ని కాపాడుకునేందుకు ఆత్మార్పణ చేసుకుంది.. నేడు వాసవీమాత ఆత్మార్పణ రోజు.

రిజిస్ట్రేషన్ చార్జీల సవరణ



రేపటి నుంచే అమలుకు ఆదేశాలు

» ప్రభుత్వం కీలక నిర్ణయం
» కొన్ని ప్రాంతాల్లో 15 శాతం పైబడే..
» గతంలో పెరిగినచోట్ల మినహాయింపు
» జిల్లా స్థాయిలోనే భారీగా కసరత్తు
» ప్రజా వ్యతిరేకత లేకుండా జాగ్రత్తలు

అందరూ ఊహించినట్టుగానే రిజిస్ట్రేషన్ చార్జీలు రేపటి నుంచి పెరగబోతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పట్టణ, పల్లె ప్రాంతాల్లో పెరిగిన ధరలు అమలులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. భూమి ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లను సవరించాలనే నిర్ణయంలో భాగంగా చాలా చోట్ల 10 నుంచి 20 శాతం మేర, మరికొన్ని చోట్ల 10 నుంచి 25 శాతం మేర పెరుగుదల ఉండేలా సవరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ భూమ్ కాస్త పుంజుకోగా ఇప్పుడు రిజిస్ట్రేషన్ విలువ పెంచుతూ సర్కారు నిర్ణయం తీసుకోవడంతో రిజిస్ట్రేషన్లు పెరుగుతాయా లేక తగ్గుముఖం పడతాయా అనేది కొద్దిరోజుల్లోనే తేలబోతుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :
రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగబోతున్నాయని నెల రోజులుగా ప్రచారం సాగినట్టుగానే కూటమి ప్రభుత్వం అదే నిజం చేసింది. కొనుగోలుదారుల లావాదేవీలు భారీ ఎత్తున సాగగా రిజిస్ట్రేషన్ ధరలు పెరగక ముందే గత నెల రోజుల్లో భారీగా రిజిస్ట్రేషన్లు అయ్యాయి. వాస్తవానికి నెల రోజుల క్రితమే రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేలా ఒక ప్రతిపాదన రాగా కసరత్తు చేయాల్సిందిగా రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మూడు విడతలు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగ్గా అప్పట్లో జనం గగ్గోలు పెట్టారు. రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువ క్రమేపీ పెరుగుతూనే వచ్చింది. ఐదేళ్ల క్రితం లేఅవుట్‌లు వేశారే తప్ప క్రయ విక్రయాలు పుంజుకోలేదు. దీనికితోడు విలువైన స్థలాలు ఉంటే వైసీపీ కబ్జాలకు పాల్పడుతుండడంతో ఎవరంతట వారుగా వెనకడుగు వేశారు. భూముల కొనుగోళ్ళకు, రిజిస్ట్రేషన్లకు దూరంగా మిగిలిపోయారు. ఒక్క ఏలూరు నగరంలోనే 130కు పైగా లావాదేవీలు మూడేళ్లకు పైగా పెండింగ్‌లో నిలిచిపోయాయి. కేవలం అడ్వాన్సులు చెల్లించి అప్పట్లో ఉన్న అగ్రిమెంట్లకు దఫాల వారీగా మార్చుకుంటూ వచ్చారు. అప్పట్లో లేఅవుట్ వేయాలంటే కింది నుంచి పైస్థాయి వరకు వైసీపీ నేతలకు కప్పం చెల్లించుకోవాల్సి వచ్చేది. లేఅవుట్‌లలో కొన్ని ప్లాట్లను బహుమానంగా సమర్పించుకోవాల్సి వచ్చింది. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఆదాయం తగ్గుముఖం పట్టింది. ప్రత్యేకించి వ్యవసాయ భూములు తప్ప హౌసింగ్ లేఅవుట్‌లలో లావాదేవీలన్నీ దారుణంగా పడిపోయాయి.

పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు (శాతాల్లో)

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు	అర్బన్	రూరల్
భీమడోలు	0-15	0-15
చింతలపూడి	10-15	10-15
జంగారెడ్డిగూడెం	0-15	0-15
కామవరపుకోట	10-20	10-25
పోలవరం	10-20	10-25
వట్లూరు	0-15	0-15
ఏలూరు	0-10	10-15
గణపవరం	10-15	10-15
కైకలూరు	10-20	10-25
మండవల్లి	10-20	10-20
మండవల్లి(609)	10-20	10-20
నూజివీడు	10-20	10-20

ఇప్పుడేం జరుగుతుందంటే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోను పరిస్థితులు చక్కబడ్డాయి. భూముల క్రయవిక్రయాలపై గత నాలుగు నెలలుగా జనం దృష్టి పెట్టారు. కొంతమంది ఏకంగా బ్యాంకు రుణాలు పొంది భూముల కొనుగోలుకు సిద్ధపడినా ఆ మేరకు రిజిస్ట్రేషన్‌కు వెళ్లలేకపోయారు. ఇంతకుముందు నూజివీడు నియోజకవర్గంలో 2014-19 మధ్య మామిడి తోటలే ఎకరానికి రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు ఎగబాకాయి. కొన్నిచోట్లైమో రూ.60 లక్షలకు ధర పలికింది. అప్పట్లో ఈ ప్రాంతంలో రాష్ట్ర రాజధాని రాబోతుందన్న భూమ్ కాస్తా పంట చేలను, ఖాళీ స్థలాలను, తోటలను భారీ ధరలకు అమ్మకాలతోపాటు సమాంతర కొనుగోళ్లు జరిగాయి. అదే 2019 నుంచి 2024 వరకు ఈ ప్రాంతంలో భూముల క్రయవిక్రయాలన్నీ దాదాపు పడకేశాయి. నూజివీడులో గజం మెయిన్ రోడ్డులో రూ.20 వేల నుంచి రూ.25 వేలలోపే ధర పలకగా ఇప్పుడది రూ.40 వేల వరకు చేరింది. కీలక ప్రాంతాల్లో ఇది రెట్టింపు అయింది. ఏలూరులోని కీలక వాణిజ్య ప్రాంతాలైన ఎన్‌ఆర్‌పేట, ఆర్‌ఆర్‌పేట, ఓల్డ్ బస్టాండ్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో గజం రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు ధర పలుకగా, గత ఐదు నెలలుగా ఈ ధర ఆర్‌ఆర్ పేటలో రూ.లక్షా 30 వేలకు చేరింది. అయితే అమ్మకందారులు మరింత ధర డిమాండ్ చేస్తుండడంతో రిజిస్ట్రేషన్లు అనుకున్నంత మేర ముందుకు సాగలేదు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కైకలూరు వంటి ప్రాంతాల్లోను మూడు మాసాలుగా రియల్ భూమ్ కాస్త పుంజు కుంది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచే రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చా రు. దీంతో రిజిస్ట్రేషన్ విలువ సవరణ దాదాపు 10 నుంచి 15 శాతం మేర ఉండబోతుంది. ఏలూరు నగరంలో సత్రంపాడు, తంగెళ్ళమూడి వంటి ప్రాంతా ల్లో భూముల ధర గతంలో గజం ఏడు నుంచి తొమ్మిది వేల వరకు పెరిగింది. ఇప్పుడు అలాంటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువ పెంచకుండా మిగతా ప్రాంతాలపై దృష్టి పెడుతున్నారు.

మార్కెట్ విలువకు తగ్గట్టుగానే..

మార్కెట్ విలువకు తగ్గట్టుగానే రిజిస్ట్రేషన్ చార్జీలు సవరించబోతున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం లభించనుంది. ఇంకోవైపు భూమి ధరలు పెరిగినందున ఆ మేరకు భూయజమానులంతా ఇప్పటికే సంతృప్తిక రంగానే ఉన్నారు. రిజిస్ట్రేషన్ ధరలు సవరించే విష యంలో ప్రభుత్వం సైతం జాగ్రత్తలు తీసుకుంది. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వచ్చే ప్రతిపాదనలపై జిల్లా స్థాయిలోనే సమగ్రంగా అధ్యయనం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లకు మళ్లీ తావివ్వకుండా అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు అనంతరం ధరలు పెంచే విషయం ప్రజల్లో అసంతృప్తి కలిగించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. అందుకనే ఇంతకుముందు పెరిగిన చోట పెంచకుండా జాగ్రత్తపడుతున్నట్టు సమాచారం. ఏలూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఎంత శాతం మేర పెంచాలనేదానిలో తుది నిర్ణయంకు వచ్చారు. దీనిప్రకా రం పోలవరం, కామవరపుకోట, కైకలూరు, మండవల్లి, నూజివీడు వంటి అర్బన్ ప్రాంతాల్లో 10 నుంచి 20 శాతం మేర రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లోను రిజిస్ట్రేషన్ చార్జీల సవరణ భారీగానే ఉండ డం ఆశ్చర్యకరం. కైకలూరు అర్బన్‌లో 10 నుంచి 20 శాతం మేర పెంచగా, అదే రూరల్ ప్రాంతంలో 10 నుంచి 25 శాతం మేర పెంచారు. పోలవరం, కామవరపుకోటల్లోను ఇదే మాదిరిగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాల కంటే రూరల్ ప్రాంతాల్లోనే ఈరకంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెరుగుదల ఈ మధ్యకాలంలో ఇదే ప్రథమం.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీపీటీవో వర ప్రసాద్

మహా కుంభమేళాకు ఏలూరు నుంచి రెండు ఆర్టీసీ సర్వీసులు

ఏలూరు క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి):ఏలూరు నుంచి ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు రెండు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు ఏలూరు జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ ఎన్‌వీఆర్ వరప్రసాద్ చెప్పారు. ఏలూరులో గురువారం విలేకరుల సమావేశంలో డీపీటీవో వర ప్రసాద్‌తో పాటు ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, ఏఎంటీ జి.మురళి, పీఆర్వో కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు. డీపీటీవో మాట్లాడుతూ ప్రయాణికుల కోరిక మేరకు ఫిబ్రవరి 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఏలూరు బస్ డిపో నుంచి ప్రయాగరాజ్‌కు రెండు బస్సులు నడుపుతున్నామన్నారు. ఈ బస్సులు ఏలూరులో బయలుదేరి పూరీ, కోణార్క్, భువనేశ్వర్, ప్రయాగరాజ్, సంగమ స్థానం, కాశీ, అయోధ్య, గయ, బుద్ధగయ, తిరుగు ప్రయాణంలో అరసవల్లి సూర్యదేవాలయం, శ్రీకూర్మం దర్శనం అనంతరం ఏలూరు చేరుకుంటాయన్నారు. ఈ యాత్ర మొత్తం 8 రోజులు ఉంటుందని, యాత్రికులకు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తారన్నారు. యాత్ర ఖర్చు రూ.12,500 అని ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 93467 67670 నెంబరుకు సంప్రదించాలన్నారు.

సంక్రాంతి ఆదాయం రూ.కోటి 14 లక్షలు

ఈ ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్‌కు 572 స్పెషల్ బస్సులు నడపగా కోటి 14 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. గతేడాదితో పోలిస్తే ఈఏడాది రూ.పది లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఫిబ్రవరి 26న వచ్చే మహాశివరాత్రి పర్వదినం సంద ర్భంగా బలివే క్షేత్రానికి ఏలూరు - నూజివీడు నుంచి 60 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పట్టిసీమకు జంగారెడ్డిగూడెం నుంచి 30 బస్సులు, తాడేపల్లిగూడెం నుంచి 20 బస్సులు, తాడేపల్లిగూడెం వద్ద ఉన్న వీరంపాలెంకు తాడేపల్లిగూడెం నుంచి 10 బస్సులు, ఏలూరు నుంచి 4 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి 7,8 తేదీల్లో జరిగే అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 50 బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రైతన్నకు అండగా..

» సాగు.. పెట్టుబడి సాయం పెంపునకు కసరత్తు
» ఖరీఫ్ నుంచి ఎకరా వరికి రూ.46 వేల నుంచి రూ.50 వేలు
» అనుబంధ పంటలకూ పెంచేలా కసరత్తు



ఏలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ, ఇతర పంటల పరంగా ముందంజలో ఉండే ఏలూరు జిల్లాలోని రైతులకు పెట్టుబడి సాయం పెంపునకు యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. 2025-26 ఖరీఫ్, రబీలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (పెట్టుబడి రుణ పరిమితిని)ను పెంచుతూ ఇటీవల డీఎల్‌ఆర్‌ఎస్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నారు. పెంచిన పెట్టుబడి సాయం వివరాలను ఆమోదం కోసం రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీకు నివేదించనున్నారు. జిల్లాలో వ్యవసాయ కూలీలు కొరత, యాంత్రీకరణ, పంటల మార్పిడి తదితర కారణాలతో రైతులు పండించే పంటలకు సాగుబడి వ్యయం విపరీతంగా పెరిగింది. వివిధ వ్యవసాయ, మత్స్య కారుల ప్రతినిధులు, సంఘాలతో చర్చించి, వారి సూచనలను, సలహాలను పరిగణన లోకి తీసుకుని పెట్టుబడి సాయం పెంపును నిర్ణయించారు. ఇందులో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కీలకంగా వ్యవహరించింది. జిల్లాలో వరి 1,11,567 హెక్టార్లు, మొక్కజొన్న 23,470 హెక్టార్లు, అపరాలు 18,038,పొగాకు 10,052, వేరుశెనగ 3253, పత్తి 3253, ఇతర పంటలు 4,456 హెక్టార్లలో సాగులో ఉన్నాయి. ఆయిల్ పామ్ 49,331, మామిడి 15,329, కొబ్బరి 14,518, కోకో 13,192, కూరగాయలు 1067, ఇతర ఉద్యానపంటలు 15,999 హెక్టార్లలో సాగులో ఉంటున్నాయి.

రుణ పరిమితి పెంపు ఇలా..

సాగునీటి కింద సాగయ్యే వరికి 2024-25 వరకు ఎకరాకు రూ.42 వేల నుంచి రూ.46వేలు ఖరీఫ్‌నకు అమలు చేయగా రబీలో రూ.45 వేల నుంచి రూ.49 వేలు ఇచ్చారు. దానిని 2025-26 ఏడాదికి ఖరీఫ్‌కు రూ.46 వేల నుంచి రూ.50 వేలు, రబీలో వరికి రూ.50 వేల నుంచి రూ.55 వేలకు పెంచా రు. చెరకు,పొగాకులకు రుణ పరిమితిని రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు యథాతథంగానే ఉంచారు. మినుము,పెసలుకు రూ.20 వేలు - రూ.22 వేల నుంచి 25 నుంచి 30 వేల రూపాయలు రెండు పంటలకు రుణ పరిమితిని అమలు చేస్తారు. మొక్కజొన్నకు రూ.44-46 వేల నుంచి 46-50 వేలు వర్తింప జేస్తారు. అరటి పంటకు స్వల్పంగా 90 నుంచి లక్ష పరిమితిని రూ.95 వేల నుంచి రూ.లక్షా ఐదు వేలకు పెంచారు. పత్తికి రూ.లక్షా నలబ్బై వేలు- రూ.లక్షా యాబ్బై నాలుగు వేలను యధాతథంగానే ఇవ్వనున్నారు. జిల్లాలో వరి, చెరకు, ఇతర పంటల తర్వాత ఎక్కువగా సాగయ్యే ఆయిల్ ఫామ్‌తో పాటు అంతర్ పంటలకు సాగుచేసే రైతుకు 70-75 వేల నుంచి 75-80 వేలు అమలు చేస్తారు. వాణిజ్య పత్తికి 44-50 వేలను 50 నుంచి 55 వేలకు పెంచారు. ఎండుమిర్చికి రూ.1.15-1.25 లక్షల నుంచి రూ.1.25-1.30 లక్షలు రెండు సీజన్‌ల్లో వర్తింప జేస్తారు. డెయిరీ, గొర్రెలు, మేకలు, ఇతర అనుబంధ రంగాలకు పాత వాటినే అమలు చేయడానికి నిర్ణయించారు.

రూ.15 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం

ఏలూరు టూ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 'నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. గత ఐదేళ్లలో గుంతల రోడ్లపై ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి ప్రాధాన్యంగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నాం. ఇప్పటికే రోడ్లపై గుంతలను పూడ్చాం. రానున్న రోజుల్లో రూ.15 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తా'మని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. ఏలూరు నగరంలోని బిర్లా భవన్ సెంటర్ నుంచి గడియారపు సెంటర్ కూడలి వరకు రూ.65 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ఎమ్మెల్యే చంటి పరిశీలించారు. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంఈ సురేంద్రబాబు, డీఈ రజాక్, ఏఈ సాయి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు ప్రవీణ్, శ్రీనివాసరావు, దేవరకొండ శ్రీనివాసరావు, హనుమంతరావు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, పెదబాబు

ఐటీడీఏ అధికారులతో కలెక్టర్ సమావేశం

ఏలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలను పటిష్టం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని మౌలిక సదుపాయాలపై కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్రంలోనే ఆదర్శ ఐటీడీఏను కేఆర్‌పురంను నిలిపే దిశగా అన్ని శాఖ అధికారులు పనిచేయాలన్నారు. విద్యుత్ సౌకర్యం లేని ఏ ఒక్క గిరిజన గ్రామం ఉండకూడదని, రోడ్డు, టెలిఫోన్, అంతర్గత రహదారులు, తాగునీరు, మరుగుదొడ్డి తదితర మౌలిక సదుపాయాలు విధిగా కల్పించాలన్నారు. పీసా గ్రామ ఎన్నికల నిర్వహణపైన ఆమె సమీక్షించారు. ఐటీడీఏ పీవో కె.రాములు, ఏపీవో నాయుడు, డిప్యూటీ డీహెంహెచ్‌వో డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.




బాల్ బ్యాడ్మింటన్ ప్రథమ బహుమతి అందుకుంటున్న సెయింట్ థెరిస్సా కళాశాల జట్టు... కప్ అందుకుంటున్న హ్యాండ్‌బాల్ క్రీడాకారిణుల జట్టు

నన్నయ వర్సిటీ ఛాంపియన్లుగా సెయింట్ థెరిస్సా జట్లు

ఏలూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల క్రీడాకారులకు ఇటీవల నిర్వహించిన ఆటల పోటీల్లో ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులు నన్నయ వర్సిటీ చాంపియన్లుగా నిలిచారు. నిడదవోలు ఎస్.వి.డి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 24న జరిగిన అంతర్ కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కళాశాల విద్యార్థినులు జి.పూజ, జి.పుణ్య, పి.నాగ వినయశ్రీ బృందం ప్రథమ బహుమతిని గెలుచుకుని అలగప్ప విశ్వవిద్యాలయం (తమిళనాడు)లో నిర్వహించనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు నన్నయ వర్సిటీ జట్టుగా ఎంపికయ్యారు. టీం మేనేజర్‌గా కె.శ్యామల వ్యవహరించారు. ఈనెల 27, 28 తేదీల్లో అన్నవరంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో కళాశాల విద్యార్థినులు ఎస్.జెస్సీతన్మయ్, టి.జ్యోతి, ఏ.షల్లి, జి.పుణ్య బృందం ప్రథమ బహుమతి గెలుచుకుని పెరియార్ యూనివర్సిటీ (తమిళనాడు)లో జరుగనున్న అంతర్ విశ్వవిద్యాలయ టోర్నమెంట్‌కు నన్నయ యూనివర్సిటీ జట్టుగా ఎంపికయ్యారు. కోచ్‌లుగా జిల్లా హ్యాండ్‌బాల్ శిక్షకులు మోహన్, రవికుమార్‌లు వ్యవహరించారు. త్వరలో నిర్వహించనున్న అఖిలభారత విశ్వ విద్యాలయాల క్రీడా టోర్నమెంట్‌లలో నన్నయ యూనివర్సిటీ జట్లుగా ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వ్యాయామోపాధ్యాయురాలు మేజర్ సెలీన్‌రోజ్ అభినందించారు. వీరందరికీ స్పెషల్ డైట్, ఫీజు రాయితీలను కల్పించాలని కళాశాల యాజమాన్యం నిర్ణయించిందని ప్రిన్సిపాల్ తెలిపారు.



పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కళాశాల సిబ్బంది

ఉత్సాహంగా అంతర కళాశాలల హ్యాండ్ బాల్ పోటీలు

దెందులూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ గ్రౌండ్‌లో జెఎన్‌టీ యూ కాకినాడ ఆధ్వర్యంలో 6 జిల్లాల అంతర కళాశాల హ్యాండ్ బాల్ పోటీలు ఉత్సాహంగా గురువారం ప్రారంభమయ్యాయి, పోటీలను ప్రిన్సిపాల్ ఎం.లావణ్య ఆధ్వర్యంలో జేఎన్‌టీయు క్రీడా విభాగం కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్, డీఎస్‌డీవో శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రెండురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా గుంటూరు పరిధిలో ఆరు జిల్లాలో 200 మంది క్రీడా కారులు తలపడుతున్నారు. తొలుత గుంటూరు జిల్లా సెయింట్ మేరీస్ కాలేజీ ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీ క్రీడాకారులు తలపడ్డారు. వీఆర్ సిద్ధార్థ వర్సెస్ మాచర్ల నూటన్స్ కాలేజీ తలపడ్డారు, రామచంద్ర కాలేజీ జెఎన్‌టీయూ కాలేజీ క్రీడాకారులు తలపడ్డారు. బాల పోటీలు రసవత్తంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఫైనల్ పోటీలు జరుగుతాయని ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొం టారని ప్రిన్సిపాల్ తెలిపారు.



పెనుగొండ నగరేశ్వరస్వామి ఆలయం

ఓం కుసుమ పుత్రీచ విద్మహే కన్యకుమారి ధీమహి ! తన్నో వాసవీ ప్రచోదయాత్ !

పెనుగొండ క్షేత్రంలో నగరేశ్వర స్వామి ఆలయంలో ఆత్మార్పణ చేసుకున్న వాసవాంబ వాసవీ కన్యకా పరమేశ్వరిగా అవతరించారు.. తనను వివాహ మాడదలచిన రాజు విష్ణువర్ధనుడి నుంచి పెనుగొండను రక్షించేందుకు, తన ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ఆత్మార్పణ చేసుకుంది.. నేడు వాసవీమాత ఆత్మార్పణ చేసుకున్న రోజు..

ఆత్మగౌరవ రక్షణకు ఆత్మార్పణ

నేడు పెనుగొండలో వాసవీ మాతకు సీఎం పూజలు

పెనుమంట్ర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వేంగి దేశాన్ని ఏలే కుసుమ శ్రేష్ఠి వైశ్యులకు రాజు. ఈ ప్రాంతం విష్ణు వర్ధనుడు (విమలాదిత్య మహారాజు) ఆధీనంలో ఉండేది. క్రీ.శ 10, 11వ శతాబ్దాలలో కుసుమ శ్రేష్ఠి సుమారు 18 పరగణాలను పెనుగొండను రాజధానిగా చేసుకుని పాలిస్తూ ఉండేవాడు. ఆయన, ఆయన భార్య కుసుమాంబ ఆదర్శ దంపతులుగా మెలిగి ప్రశాంతమైన జీవనం గడిపేవారు. వివాహం అయిన చాలా సంవత్సరాలకి కూడా సంతానం కలుగ లేదు. రాజ్యానికి వారసులు లేక వారు చింతించేవారు. తమ కులగురువును సంప్రదించగా పుత్ర కామేష్ఠి యాగాన్ని చేయమని చెప్పారు. భక్తి , శ్రద్ధలతో యాగాన్ని ఆచరించారు.. కొన్ని దినాలకే కుసుమాంబ గర్భవతి అయినది. వైశాఖ శుద్ధ దశమి, శుక్రవారం ఉత్తర నక్షత్రం కన్య రాశిలో కుసుమాంబ కవల పిల్లలకి జన్మ ఇచ్చింది. వారిలో ఒకరు ఆడపిల్ల , మరొకరు మగ పిల్లవాడు. అబ్బాయికి విరూపాక్ష అని అమ్మాయికి వాసవాంబ అని నామకరణం చేశారు. వాసవి అన్నికళలను , తర్క శాస్త్రాలను అభ్యసించి తెలివైన అమ్మాయిగా పేరు తెచ్చుకుంది. రాజు అయిన విష్ణు వర్ధనుడు తన రాజ్య విస్తరణలో భాగంగా పెనుగొండకి విచ్చేయగా వాసవిని చూసి మోహించాడు. ఆమెను వివాహమాడ నిశ్చయించాడు. కుసుమశ్రేష్ఠి కుమార్తెగా తెలుసుకుని వివాహ వర్తమానం పంపాడు. అయితే వాసవికి ఈ వివాహం ఇష్టం లేదని రాజుకు తెలియజేయడంతో ఆగ్రహించిన ఆ రాజు తన సైన్యాన్ని పంపి బలవంతంగా అయినా వాసవిని తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. కుసుమ శ్రేష్ఠి వైశ్య కులములో గల 714 గోత్రముల వారిని నగరేశ్వర స్వామి వారి ఆలయం నందు సమావేశ పరిచి విషయం వారికి తెలియజేశారు.అంతట వారిలో 103 మంది గోత్రీకులు క్షత్రియులతో వివాహం చేయడానికి అంగీకరించలేదు. వాసవి మాత్రం రాజును వివాహం చేసుకోవడానికి నిరాకరించింది. తాను పార్వతీదేవి అంశంతో జన్మించానని అగ్ని ప్రవేశం చేయనున్నట్టు తెలియజేసింది. వాసవితో పాటు 103 మంది గోత్రీకులు అగ్ని ప్రవేశం చేసేందుకు నిశ్చయించారు. ధర్మాన్ని రక్షించేందుకు, స్త్రీల గౌరవాన్ని కాపాడేందుకు, విష్ణువర్ధనుడిని అంతం చేసేందుకు, వైశ్యుల ఆత్మగౌరవాన్ని చాటేందుకు కలియుగంలో జన్మించానని చెప్పి అగ్నిగుండంలో దూకింది.. అప్పటికే తన సేనలతో పెనుగొండ పొలిమేరల్లో ప్రవేశించిన రాజు జరిగిన విషయం తెలిసి హృదయం కలిచివేసింది. రక్తం కక్కుని అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటన తెలుసుకున్న విష్ణువర్ధనుని కుమారుడు రాజరాజ నరేంద్రుడు హుటాహుటిన పెనుగొండ పట్టణం చేరుకున్నాడు. వాసవీ గౌరవార్థం ఒక విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. అప్పటి నుంచి వైశ్యులందరు వాసవీ మాతను తమ కుల దేవతగా తలచి పూజలు చేస్తున్నారు.



పెనుగొండ వాసవీ శాంతిధామ్‌లో విద్యుద్దీప కాంతుల్లో అమ్మవారి విగ్రహం



అధికారికంగా ఆత్మార్పణ దినం

ఆచంట/పెనుగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ చేసుకొన్న రోజును ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రకటించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 31న పెనుగొండ నగేశ్వరస్వామి ఆలయంలో జరగనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ముందుగా కన్యకాపరమేశ్వరిని దర్శించుకున్న అనంతరం పక్కనే ఉన్న వాసవీ ధామ్‌ను సందర్శించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. మాఘశుద్ధ విదియ రోజున 102 మంది గోత్రీకులతో వాసవీ ఆత్మార్పణ చేసుకున్నారు. పెనుగొండ నగరేశ్వరస్వామి ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారుగా వెలిశారు.

నేడు కార్యక్రమాలు ఇలా

- ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు అభిషేకాలు,
- 8 గంటలకు వాసవి మాత దీక్షా దారులు అమ్మవారికి గ్రామంలో పల్లకి ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం హోమాలు చేస్తారు.
- మధ్యాహ్నం 12 గంటలలకు 102 హోమ గుండాల్లో మహాపూర్ణాహుతి. అనంతరం దర్శనాలు, మాలదారుల దీక్ష విరమణ, 12.30కు అన్న సమారాధన
- మధ్యాహ్నం 3 నుంచి దర్శనాలు, హారతి కార్యక్రమాలు
- రాత్రి 7 నుంచి నిప్పులగుండం. 8.30లకు నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాద వితరణతో ముగుస్తాయి.

సేంద్రియ సాగుతో ఉపాధి

పెదపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అరెకరం పొలం కౌలుసాగుకు తీసుకుని టమాటా, బీర, ఆనప, బెండ పంటలతో పాటుగా వాటిలో అంతర పంటగా బంతిపూల సాగు చేస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కిశోర్ దంపతులు. వ్యవసాయకూలీ జీవనాధారంగా బతికే వీరు నిత్యం చేసేందుకు పనుల్లేకపోవడంతో కొన్నేళ్ల క్రితం కొత్తూరు-పెదపాడు ప్రధాన రహదారి పక్కన భూమిని కౌలుకు తీసుకుని రసాయన ఎరువుల జోలికి పోకుండా సేంద్రీయ ఎరువులను వాడుతూ నాణ్యమైన కూరగాయలను పండించి, అక్కడే రోడ్డుపక్కన వాటిని అమ్ముతున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువగా నాణ్యతలో మెరుగ్గా ఉండ టంతో పరిసర ప్రాంతాల ప్రజలు వీరివద్ద కూరగాయలను కొంటూ సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల సాగులో చీడపీడలు, కోతుల బెడదలు వున్నా వాటన్నింటినా ఎదుర్కొంటూ నాణ్యమైన కూరగాయలను పండించడం సంతృప్తినిస్తుందని, కొనుగోలుదారులు కూడా సంతృప్తి చెందుతు న్నారని తెలిపారు.



కూరగాయలు కోస్తున్న కిశోర్ దంపతులు



108 కళశాలతో మహిళల శోభాయాత్ర

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

భీమవరంటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భీమవరం కిష్కిందాపురంలోని శ్రీసీతారామ లింగేశ్వర స్వామి నూతన దేవాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం 108 మహిళలచే కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. శ్రీస్వామి వారు, అమ్మవార్ల పరివార దేవతామూర్తుల విగ్రహాలతో సన్నాయి వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపు ఆలయ ప్రాంగణం నుంచి పట్టణంలోని శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి ఆలయం ప్రధాన వీధుల గుండా శోభాయమానంగా జరిగింది. జిల్లా దేవాదాయ శాఖ అధికారి సుబ్బారావు, ఈవో ఫణిరామ కిషోర్, ఈవో తోట శ్రీనివాస రావు, కంతేటి వెంకటరాజు, అల్లు శ్రీనివాస్, అర్చకులు ముప్వ శివ, హనుమత్ పాల్గొన్నారు. అనంతరం విగ్రహాలకు, ధాన్యాధివాసం. పుష్పాధివాసం, జలాధివాసం చేశారు.

వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

ఏలూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, అసోసియేట్ అధ్యక్షుడు ఆర్కే శ్రీనివాసరావు తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన ఛాంబర్‌లో ఐక్యవేదిక ఛైర్మన్ కె.సూర్యనారాయణతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కొత్తగా సచివాలయ వ్యవస్థలో హేతుబద్ధీకరణ పేరుతో జరుగుతున్న ప్రక్రియలో రాష్ట్రంలో పని చేస్తున్న 15వేల మంది గ్రేడ్ -1, గ్రేడ్ -2 వీఆర్వోలను రెవెన్యూ శాఖ పరిధిలోనే విధులు నిర్వహించేలా, బీడీవోగా తహసీల్దార్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహాసిల్దార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుగుణ, మిర్యాల లక్ష్మీనారాయణ, ప్రసన్న, అప్పలనాయుడు, ఏ.ప్రభాకర్, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎన్నో జీవితాలను కథలుగా మార్చారు.. తందాన తాన తందనాన అంటూ బుర్రకథ రూపంలో ప్రజల చెంతకు తీసుకెళ్లారు.. ఆయన జీవితమూ ఒక కథే.. తరచి చూస్తే ఒక కన్నీటి జీవన ప్రయాణమే.. కళనే నమ్ముకుని ఏం సాధించారంటే పేరు తప్ప ఏం లేదు.. చివరి వరకూ కళనే నమ్ముకున్నారు.. ఆకలితో ఉన్నా ఆ కళను మాత్రం ఆపలేదు.. చివరి వరకూ అదే ఊపిరిగా జీవనయానం సాగించారు.. ఏదో ఒక రోజు తన కళ కడుపునింపక పోతుందా అంటూ ఎదురుచూశారు.. 76 ఏళ్ల జీవితంలో వెను తిరిగి చూస్తే వేల ప్రదర్శనలు.. అయితే ఆయన నమ్మ కమే నిజమైంది.. తన కళ కడుపునింపేటంత పద్మశ్రీ అనే బిరుదును తెచ్చింది.. అయితే ఆ ఆనందాన్ని పంచుకోవడానికి.. ఆ పురస్కారం అందుకోవడానికి మిరియాల అప్పారావు మన మధ్యన లేరు.. ఆయన కుటుంబ పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

- (ఆంధ్రజ్యోతి/ రావులపాలెం)



బుర్రకథ.. ఊపిరిగా..

మన పద్మశ్రీ మిరియాల అప్పారావు

కళ..కళ కోసం..ప్రజల కోసం.. అనే అన్వయం కచ్చితంగా బుర్రకథకు దక్కుతుంది. ఎందుకంటే మనకున్న జానపద కళారూపాల్లో హరికథ తర్వాత చాలా ముఖ్యమైన గాన ప్రక్రియ. మన తెలుగువాళ్ల ఈ కథా ప్రక్రియను ఎంత ప్రభావవంతంగా వినియోగించుకున్నారంటే జానపద, పౌరాణిక కథల నుంచి వీరోచిత ఉద్యమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాల వరకు అత్యద్భుతంగా బుర్రకథ ఒదిగిపోయింది. ఇలా ఒదిగిపోవడానికి బుర్రకథా పితామహుడిగా షేక్ నాజర్ వేసిన పునాదులు అటువంటివి. ఆయనకు ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చి గౌరవించింది. అలనాటి బుర్రకథకుల్లో రావులపాలెంనకు చెందిన మరొక ఆణిముత్యం మిరియాల అప్పారావు. ఇటీవల మరణించిన ఆయనకూ పద్మశ్రీ ప్రకటించింది. ప్రభావవంతమైన కథనంతోపాటు చతురతతో కూడిన హాస్యం, వినోద సంభాషణలతో రాగయుక్తమైన విన్యాసాల మధ్య సాగే బుర్రకథ... కొన్ని దశాబ్దాలపాటు తిరుగులేని కళగా చరిత్ర సృష్టించింది. దీనికి కారణం ఒక నాజర్.. ఒక మిరియాల.. ఇంకా ఎందరో..

ఇప్పుడు నాణేనికి రెండో వైపు చూద్దాం. దాదాపు అయిదు దశాబ్దాలపాటు బుర్రకథే ప్రాణంగా మిరియాల అప్పారావు చివరి వరకు అదే తపనతో జీవించారు. ఇక్కడ మరొక ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఆయన కుటుంబం యావత్తూ ఇదే రంగంలో ఉండి జీవనం సాగిస్తుండడం. కాకపోతే వేలాది ప్రదర్శనలు ఇచ్చిన కళాకారుల కుటుంబాలు ఏ స్థాయిలో ఉన్నాయో చూద్దామని ప్రయత్నిస్తే చాలాసార్లు మనకు నిరాశే ఎదురవుతుంది. దానికి కారణం ఆ కళనే నమ్ముకుని, ముందు తరం వారసులుగానే తమ జీవితాలను కొనసాగించడానికి వారు శక్తినంతా ధారపోయడమే ఒక శాపమవుతోంది. ఈ నేపథ్యంలో వీరి కృషి కళారంగానికి ఎనలేని సేవ అనాలా.. కళనే నమ్ముకుని తమ 'భవిష్యత్తు'ని ధారపోసిన త్యాగమూర్తులనాలా..

ఇంటిల్లపాదీ బుర్రకథకులే..

కళను నమ్ముకుని ఎన్నో ప్రదర్శనలు ఇస్తూ గుర్తింపు తెచ్చుకున్న బుర్రకథ కళాకారులకు ఇవాళ ఆదరణ లేదు. కేవలం సామాజిక చైతన్య కార్యక్రమాల కోసమే ఈ కళారూపం అన్నట్టుగా మారిపోయింది. ఒక కుటుంబం ఐదు దశాబ్దాలపాటు బుర్రకథ కళారంగంలోనే జీవితం సాగించింది. ఒకరిద్దరు కాదు, ఇంటిల్లపాదీ ఇదే రంగానికి తమ జీవితాలను అంకితం చేసింది. యజమాని నుంచి కూతుర్లు, కొడుకులూ అందరూ ఇదే జీవనం. 50 ఏళ్లుగా.. వేలాది ప్రదర్శనలు.. సత్కారాలు, ప్రశంసలు, బిరుదులు.. హోరెత్తిన జనం చప్పట్లు..



కుటుంబంతో మిరియాల అప్పారావు (ఫైల్)

చిన్న డాబా ఇల్లే ఆస్తి

76 ఏళ్ల కళాప్రయాణం.. వేల ప్రదర్శనలు.. ఆయనకు ఉన్నది మాత్రం రావులపాలెంలో పార్కు వద్ద 4 సెంట్లు అంటే అంటే సుమారు 200 గజాల స్థలం.. ఆ స్థలంలోనే సుమారు 30 ఏళ్ల కిందట కట్టిన రెండు పోర్షన్ల చిన్న డాబా ఇల్లు.. అదే ఆస్తి.. ప్రస్తుతం ఆ చిన్న ఇంటిలోనే మిరియాల అప్పారావు నలుగురు కుమారులు సుమారు 20 మంది కుటుంబీకులు నివాసం ఉంటున్నారు.. తండ్రి వారసత్వంగా వచ్చిన బుర్రకథ కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.

స్మృతిచిహ్నం ఏర్పాటుచేయాలి

అంతటి కళాకారుడు తమ మధ్యన తిరగడం అదృష్టం అంటున్నారు రావులపాలెం ప్రజలు.. ఆయన స్మృతి చిహ్నం ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. ఆయన ఇంటి చెంతనే ఉన్న పార్కులో మిరియాల అప్పారావు విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వాస్తవ కథ విందాం...

మిరియాల అప్పారావు. ఈయనది కాకినాడ జిల్లా నడకుదురు. 1949లో మిరియాల వెంకట రామయ్య, తిరుపతమ్మలకు జన్మించారు. 1969లో బుర్రకథపై ఉన్న ఆసక్తితో ఇందులో అరం గ్రేటం చేశారు. డ్రాయింగ్ మాస్టర్ జూనియర్ నాజర్, రామిశెట్టి వీరేశం దగ్గర శిష్యరికం చేశారు. 1974లో ఆలిండియా రేడియోలో, 1994లో దూరదర్శన్‌లో ఇచ్చారు. 1975లో పెద్దాపురంలో నిర్వహించి బుర్రకథ పోటీల్లో ప్రథమస్థానం సాధించి 50 తులాల వెండి కప్ గెలుచుకున్నారు. 5వేలకు పైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు, 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ ప్రదర్శనలతో రికార్డు సాధించారు. భార్య నాగమణితో పాటు తన ఏడుగురు సంతానంతో కలిసి బుర్రకథలను చెబుతూ వచ్చారు. అంతే కాకుండా షణ్ముఖ ఆంజనేయరాజుతో కలిసి పలు నాటకాల్లోనూ నటించారు. కళారంగంలో ఆయన ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అప్పారావుకు పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. పద్మశ్రీ ప్రకటించే సమయానికి ఆయన మరణించడం, ప్రకటించిన రోజు దశదినకర్మ రావడం కుటుంబ సభ్యులను కొంత ఆవేదన కలిగించినప్పటికీ ఆయనకు గుర్తింపు రావడం అవి..సంతోష క్షణాలే..

ఇదీ కుటుంబ నేపథ్యం..

పద్మశ్రీ అవార్డు దక్కించుకున్న మిరియాల అప్పారావుకు భార్య నాగమణి, నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సుబ్బరాజు, బ్రహ్మాజీ, మిరియాల సిద్ధయ్య, బాబా, వీరనాల పద్మావతి, వీరనాల లలిత, యడవల్లి శ్రీదేవి. వీరిలో శ్రీదేవి తాడేపల్లిగూడెంలో ఉండగా మిగిలిన వారంతా రావులపాలెంలోనే ఉంటున్నారు. అప్పారావు తన 50 ఏళ్ల ప్రస్థానంలో 25 ఏళ్ల కిందట రావులపాలెంలో సొంతింటిని నిర్మించారు. ప్రస్తుతం ఆ ఇంటిలోనే నలుగురు కుమారులు తమ కుటుంబాలతో ఉండడం విశేషం.

చివరి కోరిక ఇదే..

ఆయన ధ్యాస.. శ్వాస బుర్రకథ.. అందుకే చివరి కోరిక కూడా అదే.. బుర్రకథను నలుగురికీ నేర్పించాలన్నది ఆయన చివరి కోరిక. తరచూ కుమారులకు అదే చెబుతుండే వారట.. ఆ కోరిక తీరకుండానే మరణించారు.. బుర్రకథకు ఆదరణ తగ్గిన నేపథ్యంలో ఆ అవకాశమూ రాలేదు.. ప్రభుత్వం ఆ అవకాశం తమకు కల్పించాలని కుమారులు కోరుతున్నారు.. ప్రభుత్వం సహకరిస్తే బుర్రకథ కళను నలుగురికి నేర్పించి.. తమ తండ్రి చివరి కోరిక తీర్చుతామని చెబుతున్నారు.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహకరించాలని వేడుకుంటున్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

పోలీస్ స్టేషన్ రైటర్లకు శిక్షణలో ఎస్పీ కిశోర్


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

పెదవేగి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు న్యాయం కోసం ఎంతో నమ్మకంతో పోలీస్ స్టేషన్‌కు వస్తారని, ఉత్తమ సేవలందించి వారి నమ్మకాన్ని నిలబెట్టాలని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ అన్నారు. స్టేషన్‌కు వచ్చే వారిని మర్యాదగా పలకరించి, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని సూచించారు. జిల్లాలోని 36 మంది స్టేషన్ రైటర్లకు పెదవేగిలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో గురువారం ఎస్పీ కిశోర్ మాట్లాడారు. ఆధునిక యుగంలో పోలీసుల విధి నిర్వహణ సవాళ్లతో కూడుకుని ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విధులు నిర్వర్తిస్తే మరింత మెరుగైన సేవలు అందించవచ్చని సిబ్బందికి సూచించారు. ఎస్‌హెచ్‌వో తర్వాత రైటర్లది ప్రధాన పాత్ర అని, వారికి ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రైటర్ల అనుసరించే విధానంపైనే స్టేషన్ ప్రతిష్ఠ ఆధారపడి ఉంటుందన్నారు. ఫిర్యాదుదారులతో నడుచుకునే విధానంపైనే రైటర్ల సమర్థత ఆధారపడి ఉంటుందని ఎస్పీ తెలిపారు. కేసుల విచారణలో సీసీటీవీల ప్రాధాన్యత, వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డీటీసీ ప్రిన్సిపాల్, జిల్లా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ రైటర్లకు ఆధునిక, సాంకేతిక విధానాలపై శిక్షణ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించగలమన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రైటర్లకు ప్రశంసా పత్రాలు అందించారు. డీటీసీ డీఎస్పీ సీహెచ్‌జీవీ.ప్రసాద్, సీఐ రామారావు, పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ, డీటీసీ ఎస్‌ఐలు ఎస్.శ్రీనివాసరావు, విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన తొలి విడత జేఈఈ మెయిన్స్


సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో విద్యార్థులను పరిశీలిస్తున్న సిబ్బంది

ఏలూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షలు గురువారం ముగిశాయి. చివరి రోజు బీఆర్క్, బీప్లానింగ్ పరీక్షలకు ఏలూరు జిల్లాలో సిద్ధార్థ క్వెస్ట్ స్కూలు పరీక్ష కేంద్రంలో 180మంది విద్యార్థులకు 138 మంది, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో 100 మందికి 70 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 118మందికి 107మంది హాజరయ్యారు. ఈ నెల 22న ప్రారంభమైన పరీక్షలను డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఆర్డీవో అంబరీష్ తదితరులు పర్యవేక్షించారు. జిల్లాలో మొత్తం 3497మంది విద్యార్థులకు 3348 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్‌లో జరుగనున్న మలివిడత జేఈఈ మెయిన్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించాల్సి ఉంది.

● భీమవరం రూరల్: భీమవరం పట్టణంలో డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో జేఈఈ మెయిన్స్ 2025 తొలి విడత పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. వంద మంది విద్యార్థులకు 89 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

విద్యార్థులు కృత్రిమ మేధస్సుపై పట్టు సాధించాలి

- నిట్ వరంగల్ ప్రొఫెసర్ వెంకటకృష్ణ

పెంటపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ కృత్రిమ మేధస్సుదేనని, విద్యార్థులు కృత్రిమ మేధస్సుపై పట్టు సాధించాలని వరంగల్ నిట్ సీఎస్‌ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వెంకటకృష్ణ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీరమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంస్థ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారంతో జనరేటివ్ ఏఐ అంశంపై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీఫణికృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికత ఆవిష్కృతం అవుతుందన్నారు. కంపెనీలు, పరిశ్రమలు, సంస్థలలో కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం అవసరం, వినియోగం రోజురోజుకు పెరుగుతుందన్నారు. అందుకు తగ్గట్టుగానే కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయన్నారు. విద్యార్థులు వాటిని అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఏపీ నిట్ డీన్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే.శాస్త్రి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, మిషన్ లెర్నింగ్ వంటి నూతన సాంకేతికతలపై విద్యార్థులు పట్టు సాధించాలని, సమాజహిత అవసరాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ నగేష్‌భట్టు తదితరులు పాల్గొన్నారు.


పార్కును పరిశీలిస్తున్న భరత్, కెనరా బ్యాంకు సీఈవో సత్యనారాయణరాజు, నేతలు

పార్కు అభివృద్ధికి కెనరా బ్యాంక్ రూ.50 లక్షల విరాళం

ఆకివీడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధికి ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు చేస్తున్న కృషి అభినందనీయమని కెనరా బ్యాంకు సీఈవో కలిదిండి సత్యనారాయణరాజు అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్ర పక్కన ఆర్‌ఆర్‌ఆర్ బృందావనం పార్కును ఆర్‌ఆర్‌ఆర్ తనయుడు భరత్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. కెనరా బ్యాంక్ సామాజిక బాధ్యత నిధుల నుంచి సుమారు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, షెటిల్ కోర్టు, యోగా, ధ్యానం ఏర్పాట్లతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, నౌకట్ల రామారావు, గంధం ఉమా, జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, ఇంజనీర్ దాసరి సత్యనారాయణ, మోటుపల్లి సత్యనారాయణ, చిరంజీవి సత్యనారాయణ, బత్తుల రవి తదితరులు ఉన్నారు.

అబ్బాయిరాజు పార్కు పరిశీలన

ఉండి: ఉండిలోని కలిదిండి అబ్బాయిరాజు పార్కును చూసిన ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణంరాజు కుమారుడు భరత్ గురువారం పరిశీలించారు. ఆర్‌ఆర్‌ఆర్, దాతల సహకారంతో ఉండి పార్కును అభివృద్ధి చేసిన పార్క్‌ను పరిశీలించిన ఆయన ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ప్రణాళికతో చేపట్టి పూర్తిచేస్తామన్నారు. డీసీ చైర్మన్ తోట ఫణిబాబు, వైస్ చైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, తోట రాము, పొత్తూరి వెంకటేశ్వరరాజు, జివిసత్యనారాయణ, వేగేశ్న సత్యనారాయణరాజు, కునుకు శ్రీను, పోలుబోతు రాము, కర్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


చెక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

చెక్కపల్లి భవిత గ్రామైక్య సంఘంలో అవకతవకలు

బుక్ కీపర్‌ను తొలగించిన అధికారులు

ముసునూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లి భవిత గ్రామైక్య సంఘంలో అవకతవకలు జరగడంతో అధికారులు బుక్ కీపర్‌ను తొలగించారు. గురువారం వివిధ గ్రూపులకు చెందిన డ్వాక్రా మహిళలు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామైక్య సంఘం ప్రెసిడెంట్ డోలా శిరీషతో పాటు గ్రూపుల అధ్యక్షులు మాట్లాడుతూ భవిత గ్రామైక్య 46 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని ఈ సంఘాలకు బుక్‌కీపర్‌గా ఉన్న దోమతోటి మార్త శ్రీనిధి రుణాలు తీసుకోకపోతే ఇతర రుణాలు ఇవ్వడం కురదని, బెరింపులకు పాల్పడి సభ్యులకు తెలియకుండా రుణాలు తీసుకుందని ఆరోపించారు. సభ్యులు తీసుకున్న రుణాలకు రికవరీ నగదును సైతం బ్యాంకుకు చెల్లించకపోవడంతో నెలల తరబడి నగదు కడుతున్నా బాకీ అలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతి, సీఐఎఫ్ రుణాలను సైతం గ్రూప్ సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి రుణాలను తీసుకుని అక్రమాలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్భిణిగా ఉన్నప్పుడు 46 ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకుని మాకు తెలియకుండా నగదును డ్రా చేసుకుందని శిరీష ఆరోపించారు. బుక్‌కీపర్ మార్త తన సొంత గ్రూప్‌లోనే సభ్యులకు తెలియకుండా రూ.10 లక్షలు రుణాలు తీసుకుందన్నారు. మొత్తం 46 గ్రూపుల్లో సుమారు రూ.40 లక్షల వరకు అవకతవకలు జరిగాయని ఆరోపించారు. బుక్‌కీపర్‌గా మార్తను తొలిగించినా గ్రామైక్య సంఘంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయాలని కోరారు.

లెక్క తేల్చండి..!



విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యలో పొంతన లేని వివరాలు

ఐదు రకాల బడుల ఖరారుపై అధికారుల కసరత్తు.. నేడు ఎంఈవోలతో సమావేశం

ఏలూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ యూనిట్‌గా ఐదు రకాల బడుల ఖరారుపై అధికారులు ఖరారు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే సేకరించిన పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య వివరాల్లో తేడా గుర్తించారు. సరిగా లెక్క తేల్చాలని, ఈమేరకు ఎంఈవోలతో సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. వివరాల సేకరణపై పలు సందేహాలు, సందిగ్ధత నేపథ్యంలో సవరణలు అనివార్యమని సంకేతాలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆరుబడుల విధానంతో క్షేత్రస్థాయిలో విద్యా విధ్వంసానికి గురైంది. ఆ మేరకు జీవో 117 ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం రద్దుచేసిన విషయం తెలిసిందే. ప్రత్యామ్నాయంగా క్లస్టర్ విధానాన్ని ప్రతిపాదిస్తూ పంచాయితీ యూనిట్‌గా ఐదు రకాల బడుల విధానానికి శ్రీకారం చుట్టింది. జగన్ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను విడదీసి, వాటిని హైస్కూల్, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేయగా, తాజాగా ప్రతిపాదించిన ఐదు రకాల బడుల విధానంలో ఉన్నత పాఠశాలల్లోకి గతంలో విలీనంచేసిన ప్రాథమిక తరగతులను మళ్లీ వెనక్కి తెచ్చి పూర్వ విధానంలోనే ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒకే చోట నిర్వహించేలా కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూల్ విధానానికి తెరతీశారు. కొత్తగా ప్రతిపాదించిన మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, ఫౌండేషనల్ స్కూళ్లను ప్రారంభించేందుకు ప్రస్తుతం నడుస్తోన్న పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, టీచర్ల సంఖ్య, మౌలిక వసతులు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేయించి వివరాలు సేకరించారు. మండలాలవారీగా ఎంఈవోలు అందజేసిన సమాచారాన్ని క్రోడీకరించి నివేదికను సిద్ధం చేశారు. దీనిపై తాజాగా సమీక్షించిన పాఠశాల విద్య ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ సరిగా జరగలేదని గుర్తించారు. దీనికి పలు లోపాలను ఉదహరించారు. తక్షణమే వాటిని సరిదిద్ది మలివిడత నివేదికను శుక్రవారమే పంపాలని ఆదేశించారు.

లేవనెత్తిన అభ్యంతరాలివే..

ఐదు రకాల బడుల విధానంలో ఏలూరు జిల్లాలో 592 పంచాయితీల్లో సుమారు 310 మోడల్ ప్రైమరీ స్కూళ్లు, సుమారు 900 బేసిక్ ప్రైమరీ స్కూళ్లు, దాదాపు 246 ఫౌండేషనల్ స్కూళ్లు ఏర్పాటుచేయడానికి అవకాశం ఉందని ప్రాథమికంగా నివేదించారు. వాస్తవానికి ప్రస్తుతం నడుస్తోన్న ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 80శాతం పాఠశాలలను ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటో తరగతి, రెండో తరగతిలతోపాటు అవసరమైనచోట 3, 4, 5 తరగతులను కూడా కొనసాగించేలా ఏర్పాటు చేయాలన్నది విద్యాశాఖ యోచన. దీనికనుగుణంగా క్షేత్రస్థాయిలో ఎంఈవోల పరిశీలన, తనిఖీలు సరిగా జరగలేదని భావిస్తున్నారు. ముఖ్యంగా తరగతులు, పాఠశాలల వారీగా జిల్లా విద్యా శాఖ వద్ద ఎన్‌రోల్‌మెంట్‌కు, రాష్ట్రస్థాయిలో జిల్లాలవారీగా యుడైస్ ఎన్‌రోల్‌మెంట్ మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్టు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్‌రోల్‌మెంట్‌కు కటాఫ్ డేట్ గతేడాది డిసెంబరు 31 తీసుకోకుండా డేటాను రూపొందించారని తెలుస్తోంది. కొన్ని మండలాల్లో ఎంఈవోలు ప్రత్యక్ష పరిశీలన చేయకుండా డేటా ఎంట్రీ ఆపరేటర్లపై ఆధారపడి ఐదురకాల బడుల సంఖ్యను నిర్ధారించారనే అనుమానాలు ఉన్నాయి. దీనికి అనుగుణంగానే పాఠశాలలవారీగా ఉపాధ్యాయుల శాంక్షన్, వర్కింగ్ పోస్టుల డేటా కూడా సరిగా తీసుకోలేదని సమాచారం. వీటన్నింటినీ పునఃపరిశీలించి, మళ్లీ నివేదికను తయారుచేసేందుకు శుక్రవారం జిల్లాలోని ఎంఈవోలందరితో ఏలూరులో డీఈవో వెంకటలక్ష్మమ్మ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఇపుడున్న ఐదురకాల బడుల సంఖ్య ప్రతిపాదనల్లో కొత్తగా మోడల్, బేసిక్ ప్రైమరీ, ఫౌండేషనల్ స్కూళ్ళు మారే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఏజెన్సీలో భగ్గుమన్న భూవివాదం

- గుడిసెలు వేసుకున్న గిరిజనులు
- తొలగించేందుకు గిరిజనేతరుల యత్నం
- రోడ్డుపై బైఠాయించిన నేతలు
- స్టేషన్‌కు తరలించిన పోలీసులు


సీపీఎం నేత రామకృష్ణను అరెస్టు చేస్తున్న పోలీసులు, అడ్డుకుంటున్న గిరిజన మహిళలు

బుట్టాయగూడెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన, గిరిజనేతరుల మధ్య మరోసారి భూవివాదం భగ్గుమంది. గిరిజన పేదలు గుడిసెలు వేసుకున్న భూమి ప్రభుత్వ పోరంబోకు అని గిరిజనులు వాదిస్తున్నారు. తమ వద్ద భూమికి సంబంధించిన పక్కా ఆధారాలు ఉన్నాయంటూ గిరిజనేతరులు చెబుతున్నారు. మండల కేంద్రంలోని 550/4, 550/5, 550/6 సర్వే నెంబరులో సుమారు 3 ఎకరాల భూమి పుంత పోరంబోకు భూమి అంటూ 70 మంది ఆదివాసీ గిరిజనులు సుమారు 20 రోజుల క్రితం గుడిసెలు వేశారు. గిరిజనులు ఆక్రమించిన భూమి తమదేనంటూ గిరిజనేతరుడు కరాటం సునీల్ మరికొందరు గిరిజనేతరులు చెబుతున్నారు. గురువారం పేదల గుడిసెలను గిరిజనేతరులు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని తెలుసుకున్న సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, కుంజా సత్యనారాయణ, పోలోజు నాగేశ్వరరావు, మొడియం నాగమణి ఆధ్వర్యంలో గిరిజనులు బుట్టాయగూడెం-కన్నాపురం రహదారిపై బైఠాయించారు. గిరిజనుల గుడిసెలను తొలగించిన కరాటం సునీల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఎస్సై డి.దుర్గా మహేశ్వరావు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించ వద్దని ఆందోళనకారులకు తెలిపారు. వారు వినకపోవడంతో తెల్లం రామకృష్ణ, కుంజా సత్యనారాయణను స్టేషన్‌కు తరలించారు. సంఘటనా స్థలం నుంచి ఇరువర్గాల వారిని ఎస్సై దుర్గా మహేశ్వరావు పంపించి వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు.

జనసేన నేతపై చింతమనేని అనుచరుల దాడి

- ఫిర్యాదు చేసి 3 రోజులైనా పట్టించుకోని పోలీసులు
- ఏలూరు పోలీస్ స్టేషన్ వద్ద నూజివీడు నేతల ఆందోళన


త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న జనసేన నాయకులు

ఏలూరు క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నూజివీడు మండల అధ్యక్షుడు యర్రంశెట్టి రాముపై దాడి చేసిన ఎమ్మెల్యే చింతమనేని అనుచరులపై చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు రోజులైనా ఎందుకు చర్యలు తీసుకోలేదని పోలీసులను ప్రశ్నించారు. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గురువారం బైఠాయించి నినాదాలు చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధికార ప్రతినిధి శివరామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 28న దుగ్గిరాలలో జనసేన నూజివీడు మండల అధ్యక్షుడు యర్రంశెట్టి రాముపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు దాడి చేశారన్నారు. రాము కౌలుకు తీసుకున్న చెరకు తోటలో పనిచేసుకుంటుండగా దాడి చేసి దుర్భాషలాడారన్నారు. రాము దాడి విషయాన్ని పసిగట్టి త్రీ టౌన్ సీఐకు ఫోన్ చేసి రక్షణ కల్పించాలని కోరినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత చింతమనేని ఆరాచకాలు పెరిగాయన్నారు. రామును ఇబ్బంది పెడుతున్నారని లోకేశ్, జనసేన కేంద్ర కార్యాలయానికి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ రాముపై త్రీ టౌన్‌లో కేసు పెట్టించారన్నారు. అవమానించినా తట్టుకున్నాం, మీటింగ్‌లకు పిలవకపోయినా తట్టుకున్నాం కానీ భౌతికంగా దాడులు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, నిందితులను తక్షణమే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితుడు రాము మాట్లాడుతూ 2014 నుంచి దుగ్గిరాల సమీపంలో పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నానన్నారు. 28న చెరుకు నరికిస్తుంటే చింతమనేని అనుచరులు కూలీలను బెదిరించారని, చింతమనేనిపై పోస్టులు పెడతావా అంటూ తనపై దాడి చేశారన్నారు. తనలో ఉన్న మరో యువకుడి సెల్‌ఫోన్, తన సెల్‌ఫోన్, జేబులో ఉన్న రూ.7 వేలు కాజేశారని తెలిపారు. ప్రాణభయంతో పారిపోయామని, త్రీ టౌన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకూ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేసులు నమోదు

యర్రంశెట్టి రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతమనేని గోపీ, వడ్లపట్ల బాబు, మధు, మరో ఇద్దరిపై ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దుగ్గిరాల గ్రామ వీఆర్వో తిరువీధుల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు యర్రంశెట్టి రాముపై కేసు నమోదు చేసి త్రి టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ యాప్ పేరిట మోసం

పెదపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లో నగదు చెల్లించి వీడియోలు చూస్తే డబ్బులు వస్తాయని చెప్పడంతో రూ.18,200 నగదు కట్టి మోసపోయామని బాధితులు వాపోయారు. పెదపాడు మండలం అప్పనవీడు గ్రామానికి చెందిన గుజ్జు క్రీస్తుప్రకాశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన నవీన్‌కుమార్ పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్‌సీసీ ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లో ఒకసారి రూ.18,200 చెల్లించి అందులో వీడియోలు చూడడం ద్వారా రూ.600 చొప్పున నగదు వస్తుందని నవీన్‌కుమార్ నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మి సుమారు 29 మంది ఆర్‌సీసీ యాప్‌లో రూ.18,200 చొప్పున చెల్లించారు. నగదు చెల్లించిన తరువాత యాప్ నిలిచిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాడేపల్లిగూడెంలో చోరీ

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో బుధవారం రాత్రి రెండు వేర్వేరు చోట్ల చోరులు దొంగతనానికి తెగబడ్డారు. పాతూరులోని మిద్దే వరప్రసాద్ కుటుంబంతో కలిసి బెంగళూరు వెళ్లడంతో దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టారు. నాలుగు కాసుల బంగారం, రూ.80వేలు చోరీ చేసినట్టు బాధితులు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఎఫ్‌సీఐ కాలనీలో ఒక ఇంట్లో చోరిచేసేందుకు దుండగులు ప్రయత్నిస్తుండగా ఇంట్లోని వృద్ధురాలు కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై అనుమానంతో నరికేశాడు

- మఠంగూడెంలో దారుణ హత్య

లింగపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భార్య ప్రవర్తనపై భర్తకు అనుమానం. కుటుంబంలో కలహాలు. ఈ నేపథ్యంలో భార్యను భర్త కత్తితో నరికి హతమార్చిన సంఘన లింగపాలెం మండలం మఠంగూడెంలో జరిగింది. మఠంగూడెం గ్రామానికి చెందిన జక్కంపూడి నాగమణి (40) గురువారం ఉదయం రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రవీంద్ర నాయక్, ధర్మాజీగూడెం ఎస్‌ఐ వెంకన్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నాగమణి, భర్త జక్కంపూడి మారేశ్వరరావు (మారియ్య) మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. అతడు మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి గొడవపడి మద్యం మత్తులో వేటకొడవలితో భార్యను నరికి చంపినట్లు తెలిపారు. వారికి కుమారుడు కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీం వివరాలు సేకరించింది. కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ రవీంద్రనాయక్ తెలిపారు.

ప్రియురాలే కడతేర్చింది

- వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి హత్య

కాకినాడ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ప్రియుడిని ప్రియురాలే కడతేర్చిన సంఘటన గురువారం కాకినాడలో చోటుచేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతంకు చెందిన గుడాల చంద్రశేఖర్‌స్వామి (30) రావులపాలెంలో వ్యవసాయ కూలీగా పనిచేసేవాడు. అతనికి రావులపాలెంనకు చెందిన 25 ఏళ్ల మునిస్వామి లావణ్యతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా సహజీవనానికి దారి తీసింది. ఆమెకు అప్పటికే చిత్తూరు జిల్లాకు చెందిన బాలు అనే వ్యక్తితో వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టాక విడిపోయారు. కాగా చంద్రశేఖర్ స్వామికి తెలియకుండా లావణ్య ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసే మరొకరితో సహజీవనం చేస్తోంది. అతడితో కలిసి రెండు నెలల క్రితం కాకినాడలోని డెయిరీ ఫాం సెంటర్, స్వర్ణాంధ్రకాలనీలోని టిడ్కో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. కాకినాడ ఇంటి అడ్రస్‌ను తెలుసుకుని చంద్రశేఖర్ స్వామి బుధవారం రాత్రి అక్కడికి వెళ్లాడు. అక్కడ లావణ్యతో ఘర్షణ పడ్డాడు. అలా తెల్లవారు జాము వరకు ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో విషయం ఇంతవరకు వచ్చాక తనను చంద్రశేఖర్ అంతం చేస్తాడని లావణ్య భావించింది. మసాలా దంచే ఇనుప అమన్ దస్తాతో చంద్రశేఖర్ తలపై బలంగా విచక్షణా రహితంగా మోదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం లావణ్య పరారైంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు చంద్రశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడితండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కాకినాడ పోర్ట్ సిఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెత్తలో పిచ్చిమొక్కల మధ్యన పడి ఉన్న గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలు

మన్నించు.. మహాత్మా..!

పిచ్చిమొక్కల్లో గాంధీజీ విగ్రహం

పాలకొల్లు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాడీపేట ఒకటో వీధి కుళాయి చెరువు రోడ్డు పక్కన పిచ్చి మొక్కల మధ్య మహాత్ముడి విగ్రహం పడి ఉంది. ఈప్రాంతంలో గతంలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలు ఉండేవి. కుళాయి చెరువు విస్తరణలో పాఠశాలను బ్రాడీపేటలోన 2వ వీధికి మార్చారు. అప్పటి నుంచి గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను పట్టించుకున్న వారే లేరు.


సంఘటనా స్థలంలో మృతదేహం

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

కొయ్యలగూడెం వద్ద ప్రమాదం

అశ్వారావుపేట ఆర్ఎంపీ మృతి

కొయ్యలగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం రోడ్డులోని ఇటుకల బట్టీ వద్ద జాతీయ రహదారిపై మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. గురువారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం అశ్వారావు పేట మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ సాదుభక్త వత్సల కుమార్ (75) మృతి చెందాడు. ఎస్సై చంద్ర శేఖర్ తెలిపిన వివరాల మేరకు తూర్పుగోదావరి జిల్లా తాళ్ళపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామంలోని కుమారుడి ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై ఊట్లపల్లి బయల్దేరాడు. కొయ్యలగూడెం దాటి ఇటుకల బట్టి వద్దకు వెళ్లేసరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.


ముసునూరు పోలీసుల అదుపులో ఉన్న బైక్‌లు

లోపూడిలో కోడి పందేలపై దాడి

40 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ముసునూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): లోపూడి శివారు మామిడితోటలో బుధవారం రాత్రి జరుగుతున్న కోడిపందేలపై ముసునూరు పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ చిరంజీవి స్టేషన్‌లో సిబ్బంది, చాట్రాయి ఎస్‌ఐ రామకృష్ణ సహాయంతో కోడిపందేల శిబిరాన్ని చుట్టుముట్టారు. పందెంరాయుళ్ళు పరుగులు తీయడంతో పక్కనే ఉన్న మూడు ఎకరాల పొగాకు తోట ధ్వంసమైంది. మరికొంతమంది మామిడి చెట్లుకొమ్మలు తగిలి గాయపడ్డారు. ఈ దాడిలో 40 ద్విచక్ర వాహనాలు, 12 కోడిపుంజులు, రూ 42,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గురువారం ఉదయం ట్రాక్టర్లపై బైక్‌లను స్టేషన్‌కు తరలించి, కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. కోడి పందేలు నిర్వహణ ఎవరు చేస్తున్నారని పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ప్రశాంతి వెటరన్స్ వాకర్స్ సంఘ కార్యవర్గ ఎన్నిక

ఏలూరు అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రశాంతి వెటరన్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా దున్నా వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా సలాది శ్రీరామసత్యనారాయణ ఎన్నికయ్యారు. అనంతరం నిర్వహించిన మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మాట్లాడుతూ జాతిపితగా గాంధీ చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా గాంధీ ఏలూరు విచ్చేసిన సంఘటనలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'మహిళల ఆర్థికాభివృద్ధికి జీవనోపాధి కల్పిస్తాం'

ఏలూరు టూటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పేదలకు జీవనోపాధిని కల్పించి వారి తలసరి ఆదాయం పెంచడానికి కృషి చేస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ అన్నా ప్రగడ భాను ప్రతాప్ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మెప్మా జాతీయ పట్టణ జీవనోపాధి సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భానుప్రతాప్ మాట్లాడుతూ పట్టణాల్లో సిటీ లైవ్లీహుడ్ యాక్షన్ ప్లాన్ సహకారంతో పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్ అధికారి వై.సుబ్రహ్మణ్యేశ్వరరావు, లేబర్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ నీలాద్రి, ఎంఈ సురేంద్ర బాబు, పీవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వీఎస్ఎస్ భూములను పేదలకు పంచాలి : సీపీఐ

చింతలపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : వన సంరక్షణ సమితి భూములను అర్హులైన పేదలకు పంచాలని సీపీఐ సీనియర్ నాయకుడు ఎం.వసంతరావు డిమాండ్ చేశారు. గురువారం గణిజర్లలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పేదలకు భూములు పంచడం వల్ల పేదరికన్ని నిర్మూలించవచ్చని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ కార్యదర్శిగా బోయ రాఘవరావు, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కంచర్ల గురవయ్య, టి.బాబు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే సొంగా

చింతలపూడి/లింగపాలెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలో రాఘవాపురం పంచాయతీ డీఎస్‌రావు పేటకు చెందిన పుప్పాల వెంకట దుర్గారావుకు లక్షా 1080 రూపాయలు, కె.గోకవరం గ్రామానికి చెందిన కె.వెంకటలక్ష్మికి 69 వేల 380 రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరికి ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని, ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని తెలిపారు.

'గ్రామ పంచాయతీ మ్యాప్‌లు ఏర్పాటు చేయాలి'

పెదవేగి, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ మ్యాప్ ప్రజలకు కనిపించేలా ఆయా కార్యాలయాల్లో ప్రదర్శించాలని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో పలు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్న తరుణంలో పంచాయతీల్లో రాజకీయ నాయకుల చిత్రపటాలను ఉంచకూడదని, నిబంధనలు అనుసరించి, అభివృద్ధి పనులు చేయాలని ఆయన సూచించారు. ఈవోపీఆర్డీ షరీఫ్, గ్రామ కార్యదర్శులు కృష్ణంరాజు, సాయికృష్ణ, శ్రీనివాస్, ప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం మండలాధ్యక్షునిగా శ్రీనివాసరావు

పెదవేగి, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండల గ్రామ రెవెన్యూ అధికారు(వీఆర్వో)ల సంఘం అధ్యక్షునిగా దేవరపల్లి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఎస్కే.బాబాసాహెబ్‌ను ఎన్నుకున్నారు. పెదవేగి తహసీల్దారు కార్యాలయం దగ్గర సమావేశమైన వీఆర్వోలు మండల నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా సైదు శ్రీరామ్ ప్రసాద్, కోశాధికారిగా తోట పుల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా శకుంతలను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను తహసీల్దారు ఎస్వీ.భ్రమరాంబ, ఆర్ఐ కేవీ.సారధి అభినందించారు.

మారని నిర్వాసితుల బతుకులు : సీపీఎం

కుక్కునూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : పాలకులు మారుతున్నా నిర్వాసితుల బతుకులు మాత్రం అలాగే ఉంటున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సీపీఎం జీపుజాత కార్యక్రమంలో భాగంగా కుక్కునూరులో ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం ఇచ్చిన తరువాతే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఎల్.రామారావు, మడకం నాగమణి, పులి సంతోష్, వై.నాగేంద్రరావు, శాంతాకుమారి, వై.సాయికిరణ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నిర్వాసితులందరికీ న్యాయం చేయాలి : గౌస్

పోలవరం నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపందా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.కె.గౌస్ అన్నారు. గురువారం కుక్కునూరు మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకుని పునరావాస పరిహారం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సోయం చంద్రరావు, కే.పల్లయ్య, మల్లేష్, ఎస్.కే.మున్ని పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే చంటి

ఏలూరు రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహిస్తున్న అపుస్మా ఇంటర్ జోనల్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ జిల్లా స్థాయి క్రీడలు గురువారం అట్టహాసంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటి పాల్గొని విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎన్.బి.ఎస్.శర్మ, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, డి.ఎస్.డి.వో శ్రీనివాసరావు, అపుస్మా జోనల్ అధ్యక్షుడు బుల్లబ్బాయ్, స్పోర్ట్స్ కన్వీనర్ ఎన్.ఆర్.కె.ఏ ప్రసాద్, చంద్రశేఖర్, కడియాల విజయలక్ష్మి, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులను అభ్యసించాలి : దీపికారాణి

నిడమర్రు జనవరి 30(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులను అభ్యసించాలని సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర అధికారిణి ఎం.దీపికారాణి పేర్కొన్నారు. గురువారం పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వృత్తి విద్యాకోర్సుల అవగాహన కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర అధికారులు పరిశీలించారు. ఎస్ఎస్ఏ మోనటరింగ్ ఆఫీసర్ అభిమన్య శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధనోపాధ్యాయులు పి.వి. సత్యనారాయణ, దిలీప్ శర్మ పాల్గొన్నారు.

వెంకట సుబ్బమ్మకు పదవీ విరమణ సత్కారం

పెదవేగి, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్ఎన్‌గా పనిచేస్తున్న ఘంటసాల వెంకట సుబ్బమ్మ విధి నిర్వహణలో చేసిన సేవలు ఎనలేనివని పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పూర్ణిమ పేర్కొన్నారు. ఘంటసాల వెంకట సుబ్బమ్మ పదవీ విరమణను పురస్కరించుకుని పెదవేగి పీహెచ్‌సీ ఆవరణలో గురువారం సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ పూర్ణిమ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ఉద్యోగానికేనని, సేవలకు కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, డాక్టర్ మాధవి, ప్రత్యూష, మల్లిఖార్జున్, సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజుకు ట్రైకార్ చైర్మన్ పరామర్శ

బుట్టాయగూడెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాతృమూర్తి మల్లమ్మ మరణించిన వార్త తెలుసుకున్న ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు దుద్దుకూరులో కుటుంబ సభ్యులను పరామర్శించి మల్లమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే మాజీ టీడీపీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్, వైసీపీ నాయకులు పరామర్శించారు. నాయకులు ఎం.సోంబాబు, యంత్రప్రగడ శ్రీనివాసరావు, జి.అబ్బులు ఉన్నారు.

ఇళ్ల కూల్చివేతలను అడ్డుకున్న వారి అరెస్టు సరికాదు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : బుట్టాయ గూడెంలో పేదల గుడిసెలను కూల్చేస్తుంటే అడ్డుకున్న గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, ఇళ్ళ స్థలాల పోరాట నాయకులు కుంజా సత్యనారాయణలను అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ అధికారులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కరాటం సునీల్, అతని సోదరుడు, మరికొంత మందిని తీసుకొచ్చి పుంత పోరంబోకు భూమిలో ఆదివాసి గిరిజనులు వేసుకున్న గుడిసెలను జేసీబీతో కూల్చివేశారని వాపోయారు.

గాంధీజీది విలువలతో కూడిన నాయకత్వం

వర్ధంతి సభల్లో వక్తలు - పలు చోట్ల విగ్రహానికి పూలమాలలు వేసి నాయకుల నివాళి



టి.నరసాపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు

నిడమర్రు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : విలువలతో కూడిన నాయకత్వం వహించిన ఏకైక నాయకుడు మహాత్మా గాంధీ అని సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాద రాజు పేర్కొన్నారు. గురువారం గాంధీజీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని పెదనింద్రకొలను గాంధీ భవన్‌లో నివాళులర్పించారు. ముందుగా సర్వోదయ మండలి నాయకులు విద్యార్థులతో కలిసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథి గాంధీ స్మారక నిధి ఏపీ కార్యదర్శి వై.రామచంద్రరావు మాట్లాడుతూ గాంధీ భవన్ అభివృద్ధికి స్మారక నిధి సహకరిస్తుందన్నారు. అనంతరం 50 వేలు చెక్కును ప్రహరీగోడ మరమ్మతుల నిమిత్తం అందజేశారు.

గాంధీబొమ్మ సెంటర్‌లో నివాళి..

చింతలపూడి : పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి, ఏరియా ఆసుపత్రి వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వి.శేఖర్, కె.ప్రసాద్, జె.శివాజీ, సి.హెచ్.రాజాబాబు, జె.నెహ్రూ, కె.కేశవరావు పాల్గొన్నారు.

మహాత్ముని అడుగుజాడల్లో నడవాలి

లింగపాలెం : ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గంలో నడవాలని దేశాభివృద్ధికి యువత సన్మార్గంలో నడవాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో గురువారం మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు ఘరిమెళ్ల చలపతిరావు, గారపాటి బుజ్జియ్య, మోరంపూడి మల్లికార్జునరావు, మోరంపూడి వరప్రసాద్, నాగబాబు, సి.హెచ్.రామ్మోహన్‌రావు, టి.రాధాకృష్ణ, జి.వెంకటేశ్వరరావు, సుసాని శ్రీనివాసరావు ఉన్నారు.

ఎంపీ పుట్టా కార్యాలయంలో...

ఏలూరు టూటౌన్ : ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయంలో కాట్రు బాలకృష్ణ, ఎన్.సీతారాం తిలక్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ రిటైర్డ్ సీఈఓ కుమారస్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు కోటదిబ్బ వద్ద...

ఏలూరు కార్పొరేషన్ : స్థానిక కోటదిబ్బ వద్ద ఉన్న సర్వీసు రిజర్వాయరు-1 విశ్రాంత ఉద్యోగుల కార్యాలయం (ఎఐటీయుసి) వద్ద గల మహాత్మాగాంధీ విగ్రహానికి ది జెనల్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, వాటర్ సప్లయి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో

టి.నరసాపురం : మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కేతవరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ గాంధీజీ బాటలో యువత నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదంశెట్టి మల్లికార్జునరావు, అద్దంకి రామకృష్ణ, నల్లూరి శ్రీనివాస్, అద్దంకి రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలి

ఏలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైనందున ఆయా ప్రాంతాల్లో ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె వెట్రి సెల్వి తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని డీఆర్‌వో, ఆర్డీవోలతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై గురువారం సమీక్షించారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించి వెయ్యికిపైగా ఓటర్లు ఉంటే వేరే పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఈ నెల 31లోగా సమర్పించాలన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీల సమావేశంలో నిర్ణయం తీసుకుని ప్రతిపా దనలు సమర్పించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ వరకు కొత్త ఎమ్మెల్సీ ఓటర్లకు ఓట్లకు దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి వి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పేదలకు నూతన వస్త్రాల పంపిణీ

భీమడోలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పూళ్ళ, ఎంఎంపురం గ్రామాలకు పుప్పాల మోహన సీతారామయ్య చేసిన సేవలు అభినందనీయమని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. పూళ్ళ గ్రామంలో స్థానిక నాయకుడు పుప్పాల మోహన సీతారామయ్య విగ్రహావిష్కరణ చేసి 32 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అయన సేవలను గుర్తించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు ఎమ్మెల్యే సోదరుడు పత్సమట్ల భీమరాజు ముఖ్య అతిథిగా పాల్గొని పూళ్ళ, సాయన్నపాలెం గ్రామాల్లో ఉన్న సీతారామయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పూళ్ళ గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో సీతారామయ్య సేవలను కొనియాడారు.

'వట్టివేరు'తో ఆదాయం

ఏలూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద వైద్యం, సౌందర్య అలంకరణ ద్రవ్యాలు, లేపనాల తయారీలో ఎంతో కీలకమైన వట్టివేళ్ల సాగును చేపట్టాలంటూ ఏకోగ్రీన్ యూనిట్ స్థాపకులు కోరుతున్నారు. వివిధ రకాల బొమ్మల తయారీలోనూ వీటిని వినియోగిస్తారు. ఈ మేరకు గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కొయ్యంబత్తూరుకు చెందిన ఏకోగ్రీన్ యూనిట్ స్థాపకులు ఎస్.కె. బాబు మాట్లాడుతూ వట్టివేళ్ళకు మార్కెట్లో మంచి గిరాకీ ఉందన్నారు. ఖాళీస్థలం ఉంటే అతి తక్కువ పెట్టుబడితో వట్టివేరు సాగు చేయవచ్చన్నారు. ఇవి మహిళలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు , రైతులు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాణానికి పునాదులు యువతే : సీఐ

ఏలూరు క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : నవ సమాజ నిర్మాణానికి పునాదులు యువతే అని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు అన్నారు. ఏలూరు సమీపంలోని దుగ్గిరాలలో ఉన్న సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాలలో మహిళ రక్షక దళ టీం దంత వైద్య విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు మహిళా రక్షక దళటీం ఇన్‌ఛార్జి ఎస్ఐ కాంతిప్రియలో సంయుక్తంగా వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగానే జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ అభయ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే 9550351100 నెంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

ఏలూరు రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : సూపర్‌సిక్స్ పథకాలు ఇప్పట్లో అమలు చేయబోమని, ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పి ప్రజలను మోసం చేశారని, సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారని ఇప్పుడు పథకాలు అమలు చేయమంటూ మాటలు చెప్పి ప్రజల ఉసురు పోసుకోవద్దన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి : కృష్ణారావు

ఏలూరు క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ వృత్తి గౌరవప్రదమైందని, వారి ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి ఉపరవాణా కమిషనర్ కెఎస్ఎంవి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం ఏలూరు - చింతలపూడి రోడ్డులో ఉన్న ఉప రవాణా కమిషనరు కార్యాలయ ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆయుష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కృష్ణారావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మానవ తప్పిదాలను దృష్టిలో పెట్టుకుని ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 235 డ్రైవర్ల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఆయుష్ ఆస్పత్రికి, శంకర్ నేత్రాలయం డాక్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మోటారు వాహన ఇన్‌స్పెక్టర్స్ బి భీమారావు, జి.ప్రసాదరావు, జంగారెడ్డి గూడెం ఆర్టీవో ఎండీ మదానీ, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్ జగదీష్‌బాబు, దుర్గా విఠల్, జి.స్వామి, పి నరేంద్ర బాబు, డి.ప్రజ్ఞ, వైద్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ కృష్ణారావు

హీరో మోటో కంపెనీ డెస్టినీ స్కూటర్ ఆకర్షణీయం : ఏఎస్పీ

ఏలూరు క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : హీరో మోటో కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన డెస్టినీ 125, స్కూటర్ ఎంతో ఆకర్షణీయంగా ఉందని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. డెస్టినీ 125 స్కూటర్ని గురువారం రాత్రి ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలోని సాయి స్వర్ణ హీరో షోరూమ్‌లో ఏలూరు మార్కెట్‌లోకి అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా పరమైన అంశాలతో ఈ వాహనం తయారు చేయడం ప్రశంసనీయమన్నారు. హీరోమోటో కంపెనీ ప్రొడక్ట్ స్టేటస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్‌వివి అర్జున్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో ఉన్న 125 స్కూటర్లలోలేని అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో ఎన్నో ఫీచర్స్ ఈ వాహనంలో ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో హీరో మోటో కంపెనీ సేల్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కిరీటి, కంపెనీ కార్పొరేషన్ ఏరియా పార్ట్స్ మేనేజర్ గణేష్, సాయి స్వర్ణ హీరో షోరూం జనరల్ మేనేజర్ ఏవి సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మోటార్ సైకిల్‌ను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు/ఏలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : భీమడోలు ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలోని నిడమర్రు మండ లంలో గీత కార్మిక కులాలకు(శెట్టిబలిజ)కు కేటాయించిన మద్యం షాపునకు దరఖాస్తు చేసుకోవాలని భీమడోలు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ భీమడోలు ఎక్సైజ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తారని, 7వ తేదీ ఉదయం 10 గంటలకు ఏలూరులో సురేష్ చంద్రబహుగుణ ఇంగ్లీషు మీడియం స్కూల్లో డ్రా తీస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు రెండు లక్షల డీడీని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ ఏలూరు పేరున చలానా చెల్లించాలని, కుల ధృవీకరణపత్రం, నివాస పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ రెండు పాస్ పోర్టు సైజు ఫోటోలు అందజేయాలని సూచించారు. ఏలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గీత కార్మికుల ఉపకులాలు గౌడ మద్యం లైసెన్సు కోసం ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఒకటి, దెందులూరు మండలంలో ఒక షాపు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ స్టేషన్ సీఐ వై కృష్ణ ధనరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు, రేపు ఏజెన్సీలో ఎస్టీ కమిషన్ పర్యటన

బుట్టాయగూడెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యుడు వి.ఎస్.శంకర నాయక్ శుక్ర, శనివారాల్లో పర్యటిస్తారని కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ తెలిపారు. ఏజెన్సీలోని పోలవరం, బుట్టాయగూడెం మండలాల్లో పర్యటించి పాఠశాలలు, గురుకులాలను సందర్శించి అక్కడి పరిస్థితులపై సమీక్షలు జరుపుతారని తెలిపారు.

చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఉంగుటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : టి.వి. డిబేట్‌లో ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడిన రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని టి.డి.పి. ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు నేకూరి ఆశీర్వాదం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై కె.సాంబశివరావుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల నాయకులు గోపి, ప్రసాద్, పుల్లారావు, క్రాంతి, విజయ్ దేవ, ధర్మతేజ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించాలి

పోలవరం జనవరి 30(ఆంధ్రజ్యోతి) : పోలవరం పంచాయతీ పరిధిలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు సూచించారు. గురువారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పంచాయతీ పరిధిలో వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు.

సైన్స్ ల్యాబ్ పరికరాల బహూకరణ

పోలవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం గూటాల జడ్పీ హైస్కూల్‌కి కమల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విశ్రాంత శాస్త్రవేత్త మరిగంటి బాపూజీ గురువారం లక్షా 40 వేల రూపా యల నిధులతో సైన్స్ ల్యాబ్ పరికరాలు బహూకరించారు. సీఎస్ ఐఆర్‌లో శాస్త్రవేత్తగా పనిచేసి పలు విశ్వ విద్యాలయాలకు శాస్త్రీయ విజ్ఞానానికి పరిశోధనలకు మార్గదర్శకంగా పనిచేసిన ఆయన విద్యార్థుల కోసం ల్యాబ్ పరికరాలు బహూకరించడం అభినందిం చదగ్గ విషయమని హెచ్.ఎం. కె.వి.రాఘవన్ అన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి యాత్ర

టి.నరసాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ తెలిపాపేర్కొ న్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేపట్టిన పాదయాత్ర గురువారం టి.నరసాపురం చేరింది. ఈ మేరకు ప్రధాన సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏలూరు నుంచి కాకినాడ వరకు పాదయాత్ర చేపట్టినట్టు తెలిపారు.

పేదలందరికీ ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

ఏలూరు కార్పొరేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. స్థానిక చేపల తూము సెంటర్‌లోని సచివాలయం వద్ద గురువారం దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ళ స్థలాల అర్జీల కార్యక్రమం ఫిబ్రవరి 9వ తేదీ నాటికి పూర్తి చేసుకుని 10వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో అర్జీల రూపంలో అందజేస్తామని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేయాలని కోరారు.

వేగవరంలో కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన

దెందులూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : కుష్ఠు అంటువ్యాధి కాదని, ఆ వ్యాధి బారిన పడినవారిని ఆదరించాలని జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి ఎం.నాగేశ్వరరావు, డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ కె.సత్యనారాయణ అన్నారు. గురువారం దెందులూరు మండలం వేగవరంలో డామియన్ కుష్ఠువ్యాధి నివారణ సెంటర్‌లో సిస్టర్ రోజి, మేరీల ఆధ్వర్యంలో జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్ఠు వ్యాధి గ్రస్తులతో సామూహిక భోజనాలు నిర్వహించారు.

సైబర్ నేరాలపై హైస్కూళ్లలో అవగాహన

భీమడోలు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలు, రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని భీమడోలు ఎస్ఐ సుధాకర్ సూచించారు. భీమడోలు మండలం కురేళ్ళగూడెం, పూళ్ళ హైస్కూళ్లలో అభయ మహిళా రక్షకదళ సభ్యులు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్ పాల్గొని బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్రంపాడులోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీ లక్ష్మీగణపతి స్వామి హుండీని 61 రోజులకుగాను గురువారం లెక్కించారు. ఈ లెక్కింపులో 66 వేల 270 రూపాయలు నగదు, అమెరికన్ డాలర్లు ఐదు వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. చిననాగేశ్వరరావు తెలిపారు. స్థానిక పడమరవీధి వేంకటేశ్వరస్వామి ఆలయం ఈవో పి.రీనామాధురి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీదేవి మృతికి గారపాటి చౌదరి నివాళి

ఏలూరు రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ గాది రాంబాబు సతీమణి శ్రీదేవి ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఏలూరులోని వారి నివాసానికి గురువారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి వెళ్ళి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ విక్రమ్‌కిషోర్, గుమ్మడి చైతన్య, నడపన దానభాస్కర్, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

రైతుల ఆర్థిక ప్రగతి కోసమే సబ్సిడీలు...

మహ్మద్ షఫియా పర్వీన్, ఉద్యాన వన శాఖ అధికారిణి, చింతలపూడి



● **రైతుల ప్రోత్సాహం కోసం సబ్సిడీపై యంత్రపరికరాలు ఇస్తున్నారా?**

జవాబు : రైతుల ఆర్థిక ప్రగతి కోసం ప్రస్తుతం పండ్ల తోటలు, పూలు, కూరగాయల పంటలకు సబ్సిడీలు ఇస్తున్నాం.

● **పండ్ల తోటలకు ఏవిధమైన సబ్సిడీ ఇస్తున్నారు ?**

జవాబు : మామిడికి ఎకరాకు 7 వేల 500, జామకు 18 వేలు, ఖోఖో పంటకు 12 వేలు, ఇవికాక మూడు సంవత్సరాల పాటు మెయింటినెన్స్ కూడా ఇస్తున్నాం.

● **సబ్సిడీ ప్రోత్సాహంతో ఏ పంటకైనా విస్తీర్ణం పెరిగిందా ?**

జవాబు : ఖోఖో పంట విస్తీర్ణం బాగా పెరిగింది. కొబ్బరి, పామాయిల్ తోటలలో అంతర్ పంటగా వేస్తున్నారు. 400 ఎకరాలు ఈ ఏడాది పెరిగింది.

● **పూల తోటలకు, కూరగాయలకు ఇచ్చే సబ్సిడీ?**

జవాబు : పూల తోటలకు హెక్టారుకు 16 వేలు, కూరగాయలు హైబ్రీడ్ రకాలకు హెక్టారుకు 8 వేలు, ఇవికాక మల్చింగ్ విధానం అమలు చేస్తే వాటికీ సబ్సిడీ ఉంది.

● **యంత్ర పరికరాలకు ఏమిస్తున్నారు?**

జవాబు : చిన్న ట్రాక్టర్లకు 75 వేలు, పవర్ టిల్లర్‌కు 60 వేలు, తైవాన్ స్ప్రేయర్లకు 8 వేలు ఇస్తున్నాం.

\- చింతలపూడి

చోరీపై కేసు నమోదు

పెదపాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం తాళ్ళమూడి జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న జనరల్ స్టోర్ షట్టర్ తాళాలు పగులకొట్టి దొంగతనానికి పాల్పడినట్లుగా అదే గ్రామానికి చెందిన దుట్టా రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 29న షాపు మూసి మరుసటి రోజు ఉదయం వచ్చేసరికి తాళాలు పగులకొట్టి ఉన్నాయని, రూ. 8 వేలు నగదు పోయినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఎస్సై కట్టా శారద సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు పరీక్షలు

జంగారెడ్డిగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా బెటాలియన్ ఏలూరు వింగ్ -19 పరిధిలోని జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర హైస్కూల్లో ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు జంగారెడ్డి గూడెం బాలుర హైస్కూల్ నుంచి 41 మంది క్యాడెట్లు హాజరయ్యారు. ఈ క్యాడెట్లకు రెండేళ్ల పాటు మిలటరీడ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ రీడింగ్ శిక్షణ అందించారు. ఎన్‌సీసీ-ఏ సర్టిఫికెట్ పొందేందుకు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ ప్రాక్టికల్ పరీక్షను కల్నల్ రిషబ్‌సిన్హా, దుమినీ, ఇతర ఎన్‌సీసీ అధికారులు పర్యవేక్షించారు. ఎన్‌సీసీ ద్వారా విద్యా, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని జంగారెడ్డిగూడెం బాలుర హైస్కూల్ హెచ్ఎం లోవకుమారి తెలిపారు.

నేడు గొల్లగూడెం సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలంలోని గొల్లగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అక్కుపల్లిగోకవరం, కైకరం గృహ సముదాయాలకు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలుపుదల చేసినట్టు ఏ.ఈ.వేణు తెలిపారు. ఈ విషయమై వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

హిందూ ఆలయాల వద్ద చర్చిలు వద్దంటూ వినతి

కామవరపు కోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కోదండ రామాలయాల సమీపంలో అక్రమంగా చర్చి కట్టడం అన్యాయమని, దానిని తొలగించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ నాయకులు కాకి చంటి, స్థానికులు కె.కృష్ణ చైతన్య, బి.వెంకన్న, నల్లమోతుల బాలు, పొట్లూరి కలగయ్య, వి.మణికంఠ, వి.నాగరాజు, పి.శ్రీనివాస రావులు గురువారం కామవరపు కోట పంచాయతీ కార్యదర్శి బి.రవినాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రామాలయాల పక్కనే చర్చి కట్టడం తగదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. చర్చిని తొలగిం చాలని అభ్యర్థించారు.

ఉత్తమ అధికారికి సన్మానం

లింగపాలెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖలో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న వెటర్నరీ ఏడీ జె. లింగయ్యను లింగపాలెం మండల దళిత నాయకులు, రైతులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా మండలంలో పాడి రైతులకు అండగా ఉంటూ గ్రామాల్లో మంచి వైద్యునిగా పేరు పొందారని అన్నారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పొదిల శౌరి, అనిలేటి అజయ్, బొంతు సుధీర్, ఎం.జయరాజు, పల్లి శ్రీను పాల్గొన్నారు.

బోదవ్యాధిపై అవగాహన

ఏలూరు అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ బోదవ్యాధి (ఫైలే రియా) నివారణ దినాన్ని పురస్కరించుకుని గురువారం ఏలూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖ మలేరియా విభాగం ఆధ్వర్యంలో నగరంలో అవగాహన కల్పించారు. జిల్లా అధికారి ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ శశాంక్ మాట్లాడుతూ బోదవ్యాధిని వ్యాపించేసే దోమలు మురికికాల్వల్లో పెరుగుతాయన్నారు.

రేపటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల ఆధునీకీకరణ సాంకేతిక మరమ్మతుల నేపథ్యంలో ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ఎస్.కోటేశ్వరరావు గురువారం తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రణాళికబద్ధంగా మరమ్మతుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. గుడివాడ 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి తత్కాలికంగా విద్యుత్ సరఫరా ఆగుతుందన్నారు. ముదినేపల్లి మండలం చిగురుకోటలోని 132 కేవీ పరిధిలోని అంతరాయం కలుగుతుందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని, ప్రజలు, ఆక్వా రైతులు సహకరించాలన్నారు.

అనుమతి లేని రూ.29వేల మందులు స్వాధీనం


వింజరంలో ఎరువుల దుకాణం స్టాక్‌లిస్టు పరిశీలిస్తున్న ఏవో దివ్య

కైకలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు పురుగుమందుల విక్రయాలు జరగాలని వ్యవసాయ శాఖ ఏవో దివ్య అన్నారు. వింజరంలో ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నందున రూ.29వేలు బయోస్టీమ్‌లైట్స్‌ను స్వాధీనపరుచుకున్నారు. నిబంధనలు అతిక్రమించిన డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రొయ్యలచెరువుల నీటితో మునిగిన ఇళ్లు


మునిగిన గురైన గృహాలను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ వాసురాజు

కైకలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కైకలూరు వైఎస్సార్ కాలనీ శివారులో రెండు రోజులుగా రొయ్యల చెరువు నీటిని బయటకు తోడుతున్నారని, ఆ నీరంతా కాలనీలోకి చేరిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నీట మునిగిన ఇళ్లను గురువారం డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు పరిశీలించారు. చేపలు, రొయ్యల చెరువుల నీరు నివాస గృహాల్లోకి రాకుండా రైతులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. నీరు బయటకు తోడే సమయంలోనే డ్రెయిన్లు అభివృద్ధి చేసుకోవాలని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణం, కూటమి నాయకులు ఎండీ జానీ, వీరాబత్తిన సుధా, ఎండీ ఉస్మాన్, మత్స్య శాఖ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు మద్యం దుకాణం

కైకలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కార్మికుల కోసం ఏర్పాటుచేస్తున్న మద్యం దుకాణానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీఐ షేక్ రమేష్ తెలిపారు. మండవల్లి మండలంలో ఒక మద్యం దుకాణం కేటాయించామని, గీత కులాలు, ఉపకులాల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 5 లోపు దరఖాస్తు ఆన్ లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా అందించవచ్చన్నారు. ఫిబ్రవరి 7న జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తారని, ఆసక్తి గల వారు మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మెకానిక్‌లు సహకరించాలి

కైకలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కైకలూరులో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా బైక్, ఆటో మెకానిక్‌లు సహకరించాలని టౌన్ ఎస్సైలు శ్రీను, వెంకటకుమార్ కోరారు. టౌన్ పోలీసుస్టేషన్లో బైక్, ఆటో మెకానిక్‌లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాల మరమ్మతుల సమయంలో రోడ్లపై పెట్టడం వల్ల వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు.

'పాడి పరిశ్రమాభివృద్ధికి నిరంతర కృషి'

ముదినేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పాడి రైతు కుటుంబాల శ్రేయస్సే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు యూనియన్ చైర్మన్ చలసాని ఆంజ నేయులు తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవాల సందర్భంగా గురజ పాల ఉత్పత్తిదార్ల సహకార సంఘ సభ్యులకు గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. సంఘ అధ్యక్షురాలు ఉప్పలపాటి శ్రీలక్ష్మి, గుడ్లవల్లేరు మిల్క్ చిల్లింగ్ సెంటర్ మేనేజర్ తోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చెక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న డ్వాక్రా మహిళలు

అవకతవకలపై సమగ్ర విచారణ చేయాలి

డ్వాక్రా సంఘాల సభ్యుల వినతి

ముసునూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లిలో ఉన్న భవిత గ్రామైక్య సంఘంలో అవకతవకలు జరగడంతో అధికారులు బుక్ కీపర్‌ను తొలిగించారు. గరువారం వివిధ గ్రూపులకు చెందిన డ్వాక్రా మహిళలు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామైక్య సంఘం ప్రెసిడెంట్ డోలా శిరీషాతో పాటు గ్రూపుల అధ్యక్షులు మాట్లాడుతూ భవిత గ్రామైక్య 46 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని ఈ సంఘాలకు బుక్ కీపర్‌గా ఉన్న దోమతోటి మార్త శ్రీనిధి రుణాలు తీసుకోకపోతే ఇతర రుణాలు ఇవ్వడం కురదని, బెదిరింపులకు పాల్పడి సభ్యులకు తెలియకుండా రుణాలు తీసుకుందని ఆరోపించారు. సభ్యులు తీసుకున్న రుణాలకు రికవరీ నగదును సైతం బ్యాంకుకు చెల్లించకపోవడంతో నెలల తరబడి నగదు కడు తున్నా బాకీ అలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతి, సీఐఎఫ్ రుణాలను సైతం గ్రూప్ సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి రుణాలను తీసుకుని అక్రమాలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్భిణిగా ఉన్నప్పుడు 46 ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకుని మాకు తెలియకుండా నగదును డ్రా చేసుకుందని శిరీష ఆరోపించారు. బుక్‌కీపర్ మార్త తన సొంత గ్రూప్‌లోనే సభ్యులకు తెలియకుండా రూ.10 లక్షలు రుణాలు తీసుకుందన్నారు. మొత్తం 46 గ్రూపుల్లో సూమారు రూ.40 లక్షల వరకు అవకతవకలు జరిగాయని ఆరోపించారు. బుక్‌కీపర్‌గా మార్తను తొలిగించినా గ్రామైక్య సంఘంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయాలని కోరారు.

గౌడ కులస్థులకు నాలుగు మద్యం దుకాణాలు

నూజివీడు టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గ పరిధిలో గౌడకులస్థులకు నాలుగు మద్యం దుకాణాలను కేటాయించినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగ ప్రభుకుమార్ తెలిపారు. ఫిబ్రవరి 5వవరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఫిబ్రవరి 7న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏలూరులో సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్లో డ్రా తీస్తారన్నారు. నూజివీడు పట్టణంతో పాటు చాట్రాయి, ఆగి రిపల్లి, ముసునూరు మండలాల్లో ఒక్కో షాపు కేటాయించారన్నారు. లైసెన్సు ఫీజులో సగం మాత్రమే చెల్లించవచ్చని తెలిపారు.

వాహన డీలర్లకు రహదారి భద్రతపై అవగాహన

నూజివీడు టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రతపై వాహన యజమానులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు వాహన కంపెనీల డీలర్లు తమవంతు పాత్ర పోషించాలని, నూజివీడు ఎంవీఐ నాగమురళీ సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని నూజివీడులో షోరూమ్ డీలర్లకు, సిబ్బందికి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, ట్రిపుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవన్న విషయాలను వాహనదారులకు వివరించాలన్నారు. రోడ్డుప్రమాదంలో గాయపడిన వారికి మానవత్వ సహాయం చేసే వారికి ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులను అందిస్తోందని, తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలి

ఏలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్ని కలకు షెడ్యూల్ విడుదలైనందున ఆయా ప్రాం తాల్లో ఎన్నికల నియమావళిని ఖచ్చి తంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోన సీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని డీఆర్వో, ఆర్డీవోలతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై గురు వారం సమీక్షించారు.పోలింగ్ స్టేషన్లకు సంబంధించి వెయ్యికిపైగా ఓటర్లు ఉంటే వేరే పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఈ నెల 31లోగా సమర్పించాలన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీల సమావేశంలో నిర్ణయం తీసుకుని ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ వరకు కొత్త ఎమ్మెల్సీ ఓటర్లకు ఓట్లకు దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు.


కలెక్టర్ వెట్రిసెల్వి

క్యాంప్ బెల్ కాల్వకు గండి కొట్టి ..

సాగు నీరు చేపల చెరువులకు మళ్లింపు యత్నం

ముదినేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా తూర్పు డెల్టా శివారు ప్రాంతంలో వేలాది ఎకరాల ఆయకట్టులో సాగు నీటిని దారి మళ్లించేందుకు కొందరు చేపల చెరువుల రైతులు ప్రయత్నిస్తున్నారని మినుము రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెల్టాకు శివారు ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి, కైకలూరు మండలాల్లో సాగు నీరందక మినుము పైరు ఎండిపోతుందని 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన కథనాలపై స్పందించిన ఇరిగేషన్ అధికారులు గురువారం కాల్వలకు నీరు విడుదల చేశారు. ఆ నీటిని చేపలు, రొయ్యల చెరువులకు మళ్లించేందుకు పలువురు రైతులు ప్రయత్నం చేశారు. నీరు విడుదల చేయకముందే బుధవారం ముదినేపల్లి మండలం చేవూరు నీటి వినియోగదారుల సంఘ పరిధిలో ఒక రైతు క్యాంప్ బెల్ కాల్వకు గండికొట్టి చేపల చెరువుకు నీటిని మళ్లించేందుకు పైపులైను ఏర్పాటు చేశారు. కాల్వకు గండి కొట్టడంపై చేవూరు నీటి సంఘం అధ్యక్షుడు శాయిన ప్రసాదరావు కేఈ డివిజన్ ఎస్ఈ మోహనరావుకు ఫిర్యాదు చేశారు. విడుదల చేసిన కొద్దిపాటి నీటిని మినుము చేలకు వినియోగించుకునేలా నిఘా ఉంచాలని కోరారు. ఎస్ఈ ఆదేశాల మేరకు క్యాంప్ బెల్ కెనాల్ వడాలి సెక్షన్ ఏఈ సిద్ధార్థ, సిబ్బంది పరిశీలించారు. ప్రధాన కాల్వ గట్టుకు గండికొట్టి ఏర్పాటు చేసిన తూము, పైపులను తొలగించాలని సంబంధిత రైతుకు తెలిపారు.



అరకొర నీరు విడుదల

కైకలూరు, పెడన నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల ఆయకట్టులో మినప సాగుకు అరకొరగా నీరు విడుదల చేశారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద క్యాంప్ బెల్ కెనాల్‌కు 120, పోల్‌రాజ్ కెనాల్‌కు 120, బంటుమిల్లి కెనాల్‌కు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. చాలీచాలని నీరు ప్రధాన కాల్వల నుంచి ఒక్క బ్రాంచి కాల్వకు కూడా అందే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లోని మినుము సాగుకు ఒకేసారి నీరు అవసరం ఉండడంతో వంతుల వారీ నీటి విడుదలకు అవకాశం లేదు. మినుము రైతులు ప్రధాన పంట కాల్వల వద్ద ఇంజన్లు ఏర్పాటు చేసి బ్రాంచ్ కాల్వలకు తోడుకునేందుకు సిద్ధమవుతున్నారు.


క్యాంప్ బెల్ కెనాల్‌కు గండికొట్టి ఏర్పాటు చేసిన పైపు, తూములు

కాల్వల వెంబడి నిఘా

క్యాంప్ బెల్, పోల్ రాజ్ ప్రధాన కాల్వల వెంబడి ఇరిగేషన్ సిబ్బందితో నిఘా ఉంచినట్లు వడాలి, ముదినేపల్లి సెక్షన్ల ఏఈలు సిద్ధార్థ, కిశోర్ తెలిపారు. కాల్వలకు విడుదల చేసిన నీటిని మినుము రైతులు మాత్రమే వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. చేపల, రొయ్యల చెరువుల రైతులు ఈ నీటిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కైకలూరులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ


కలిదిండి మడలం మట్టగుంటలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గాంధీజీ ఆశయాలు మహోన్నతం

వర్ధంతి సభల్లో వక్తలు

కైకలూరు/ముదినేపల్లి/ మండవల్లి/కలిదిండి/ఆగిరిపల్లి/నూజివీడు/చాట్రాయి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీజీ ఆశయాలు మహోన్నతమైనవని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్.మాల్యాద్రి, కూటమి నేతలు పూల రామచంద్రరావు, వేంపాటి విష్ణురావు, కొల్లి వరప్రసాద్, ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు. ఓ ప్రైవేటు విద్యాసంస్థలో నెహ్రూ యువకేంద్రం, సాధన రూరల్ డెవలెప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్రం శ్యాంకుమార్, ఎస్ జమీల్ అహ్మద్, పాముల ఏసుపాదం, తదితరులు పాల్గొన్నారు. కైకలూరు లయన్స్ క్లబ్ మగువ, విజయవాడ ప్రెసిడెంట్ పైడిమర్రి రామకృష్ణ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని దత్తాశ్రమంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఉచితంగా భోజనాన్ని పంపిణీ చేశారు. సొల్లేటి మాధవి, పైడిమర్రి లక్ష్మీసుమలత, గుర్రం లక్ష్మీ మానస ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహానికి ఎంపీడీవో వై.రామకృష్ణ, కార్యాలయ ఏవో రమణారావు, సిబ్బంది, ఈవోపీఆర్డీ అశోక్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నవరంలో పునరుద్ధరించిన గాంధీ విగ్రహానికి దాత కొత్తూరు వెంకట సుబ్బారావు పూలమాలలు వేశారు. సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో ఆర్యవైశ్య సంఘ నాయకులు చీదెళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, చిట్టూరి శివప్రసాద్, కంతేటి రామోజీ, విస్సంశెట్టి నరేంద్ర తదితరులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండవల్లి సచివాల యంలో గాంధీ చిత్రపటానికి సర్పంచ్ మెండ ఝాన్సీ సురేష్‌బాబు ఘన నివాళులర్పించారు. బి.వెంకయ్య, గాయత్రి, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు. కలిదిండి మండలం మట్టగుంటలో టీడీపీ నాయకులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ , తిరుమాని చిన్ని కృష్ణ, బస్వాని హేమ సుందర్ వర్మ, బళ్ల రాజు, తిరుమలశెట్టి పరశురాముడు తదితరులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి పెద్ద కొఠాయి సమీపంలో గల మహాత్మగాంధీజీ స్థూపం వద్ద బాపూజీ 77వ వర్ధంతిని ఆగిరిపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చలవాది వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎం.శివరామమూర్తి, ఎం.గోపాల్, వై.నరసింహ, వై.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. గాంధీ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషిచేయాలని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు చాట్రాయి మండల విద్యాశాఖ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంఈవో బ్రహ్మచారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కృష్ణయ్య, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నూజివీడులో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముద్దరబోయిన, తదితరులు

పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పశువుల వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి ప్రహర్ష అన్నారు. ఎస్ఆర్పీ.అగ్రహారం, కాళ్లపాలెంల్లో గురువారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 190 పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 450 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. పశు వైద్యుల సూచనలు పాటించి పశువుల ఆరో గ్యంపై శ్రద్ధ వహిస్తే పాల దిగుబడి పెరుగు తుందన్నారు. కాళ్లపాలెం సర్పంచ్ పేటేటి స్వర్ణకుమారి, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండున ఉచిత మెగా వైద్యశిబిరం

కలిదిండి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కలిదిండి జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఫిబ్రవరి 2న గుండె వైద్య నిపుణులు డాక్టర్ బత్తిన నరసింహరావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరగుతుందని నిర్వాహకులు తెలిపారు. 27 మంది వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్షీరబంధు చెక్కు అందజేత

ముసునూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముసునూరు ఏస్సీ కాలనీకి చెందిన పాల ఉత్పత్తిదారుడు చీలీ ఆదాము ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 20 ఏళ్ళగా పాల సొసైటీలో పాలు పోస్తున్న ఆదాము కుటుంబానికి కృష్ణా మిల్క్ యూనియన్ క్షీరబంధు పథకం ద్వారా ఇచ్చిన రూ.50 వేలు చెక్కును గురువారం సొసైటీ అధ్యక్షుడు గాజుల ఏడుకొండలు బాధిత కుటుంబానికి అందజేశారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

ముసునూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా ఫిర్యాదులు వచ్చిన చర్యలు తప్పవని ఎంఈవో సుబ్బారావు అన్నారు. గురవారం ముసునూరులో జడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. మోను ప్రకారం విద్యార్థులకు ఆహారం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు.

మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం

ముసునూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పోరాటయోధుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడం అభినంద నీయమని నియోజకవర్గ నాయకులు దుబ్బాక దేవరాజ్, గ్రామ అధ్యక్షుడు బందుల పవన్‌కుమార్‌లు అన్నారు. గురువారం లోపూడిలో మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయి పంపిణీ చేశారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకులు కార్యక్రమానికి టీడీపీ మాజీ ఎంపీటీసీ పంజుగల వెంకయ్య రూ.25 వేలు, బందుల పెద్ద వీరాస్వామి రూ.5వేలు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, యువకులు పాల్గొన్నారు.

2న ధ్వజస్తంభ ప్రతిష్ఠ

నూజివీడు టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు శ్రీ సత్యసాయిసీతారామస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పేర్లప్రశాంత్ తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 9.24 నిమిషాలకు పంచరాత్ర ఆగమానుసారంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. 1వ తేదీ నిత్యార్చనలు, తిరుప్పావై, ప్రబంధ సేవా కాలములు ఉంటాయని తెలిపారు.

మర్లపాలెంలో సారా స్వాధీనం

చాట్రాయి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపాలెం గ్రామంలో ఏలూరు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ నాగ ప్రభుకుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిపిన దాడిలో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, నిందితుడు కుప్పాల రామచంద్రరావును అదుపులోకి తీసుకొని ఇతనికి సారా సరఫరా చేసిన వడిత్యా బిక్షాలుపై కేసు నమోదు చేసినట్లు ఏసీ చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పీఎస్‌డీ భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లోపూడిలో కోడిపందేల స్థావరంపై దాడి

40 ద్విచక్ర వాహనాలు, రూ.42,400 నగదు స్వాధీనం

ముసునూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపూడి శివారు మామిడితోటలో బుధవారం రాత్రి రహస్యంగా జరుగుతున్న కోడిపందేలపై ముసునూరు పోలీసులు దాడి చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ చిరంజీవి స్టేషన్‌లో సిబ్బంది, చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ సహాయంతో కోడిపందేల శిబిరాన్ని చుట్టు ముట్టారు. దీంతో పందెంరాయుళ్ళు పరుగులు తీయడంతో పక్కనే ఉన్న మూడు ఎకరాల పొగాకు తోట ధ్వంసమైంది. మరికొంతమంది మామిడి చెట్లుకొమ్మలు తగిలి గాయాలపాలయ్యారు. ఈ దాడిలో 40 ద్విచక్ర వాహనాలు, 12 కోడిపుంజులు, రూ 42400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.గురువారం ఉదయం ట్రాక్టర్‌లతో బైక్‌లను స్టేషన్‌కు తరలించి, కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. అయితే ఈ కోడిపందేలు నిర్వహణ ఎవరు చేస్తున్నారు అని పోలీసులు ప్రత్యేక విచారణ చేస్తున్నట్లు సమాచారం.


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

ప్రభుత్వాల వైఫల్యం వల్లే

కుంభమేళాలో తొక్కిసలాట

లిబరేషన్ రాష్ట్రనేత విమర్శ

చాట్రాయి,జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుంభమేళాలో తొక్కిసలాటకు కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో యోగి ప్రభుత్వాల వైఫల్యమే కారణమని సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరనాథ్ విమర్శించారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా అందుకు తగిన ఏర్పాట్లు చేయకపోవటం ఏమిటని ప్రశ్నించారు.మృతులకు రూ.కోటి చొప్పున, గాయపడ్డవారికి రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, తొక్కిసలాట మరణాలు అన్నీ ప్రభుత్వ హత్యలే అని ఇందుకు నైతిక బాధ్యత వహించి యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తక్షణం రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

ఒకరిపై కేసు నమోదు

నూజివీడు టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో తెలంగాణ మద్యాన్ని స్వాధీన పరుచుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఏలూరు జిల్లా ఆఫ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగప్రభు కుమార్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బోగేశ్వరరావు తన సిబ్బందితో దాడులు జరుపగా నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో బాబి అనేవ్యక్తిని అదుపులోకి తీసుకుని 48 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.

మామిడి తోటల్లో తామర పురుగును నిర్మూలించాలి

క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు

చాట్రాయి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాట్రాయి, చిత్తపూరు. చనుబండ, నరశింహారావుపాలెం తదితర గ్రామాల్లో ఉద్యాన శాఖ అధికారి హేమ ఆధ్వర్యంలో మామిడి తోటల్లో గురువారం రైతులతో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు. అనంతరం హెచ్‌వో హేమ మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి తోటల్లో తామర పురుగు గమనించటం జరిగిందని దీని నివారణకు స్పైనోసాడ్ 0.25 ఎంఎల్, లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రాములు, లేదా ఫిప్రోనిల్ గోల్డ్ 2.0 ఎంఎల్, లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలని సూచించారు. పసుపు, నీలం రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా పురుగును నియంత్రించవచ్చునన్నారు.


మామిడి తోటను పరిశీలిస్తున్న హేమ

పులి పిల్లలు కాదు.. అడవి పిల్లి కూనలు

ఆగిరిపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సగ్గూరు, కృష్ణవరం గ్రామాల ప్రజలు పులి అంటేనే భయపడుతున్నారు. కృష్ణవరం గ్రామంలో ఫణి అనే రైతు గురువారం ఉదయం పొగాకు తోటకు నీరు పెడుతుండగా నాలుగు వింత జీవుల పిల్లలు కనిపించాయి. వాటిని చూసి భయపడిన రైతు గ్రామస్తులకు తెలుపగా పులి పిల్లలు పెట్టిందని వాటి కోసంపులి వస్తుందని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామస్తులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ బాల తన సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకుని వాటిని ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు పంపగా, అవి పులి పిల్లలు కాదని, అడవి పిల్లి కూనలని నిర్ధారించారు. అటవీశాఖ సిబ్బంది కూనలకు రక్షణ కల్పించారు.


పట్టుకున్న అడవిపిల్ల కునాలు